ఈ పదాలను చూడండి. వీటలోని అక్షరాలను ఎలా సూచించారో గుర్తించండి.

| | | | | |
|---|---|---|---|---|
| I I I | I I I | I I I | I I I | I I I I |
| కడప; | పలక; | పిరికి; | ముసురు; | మరిమరి |

| | | | |
|---|---|---|---|
| U I | U I U | U I U I | U U U |
| గాలి; | సాగరం; | వేడుకోలు; | ఔనేమో |

అయితే "I" "U" లను గుర్తించటానికి మరిన్ని విషయాల్ని గుర్తుంచుకోవాలి.

కింది పదాలను చదవండి.

తర్కం; మెట్ట; చూడగన్; నష్టం వీటిలో

"ర్క" – ఇది సంయుక్తాక్షరం కదూ!

ట్ట – ఇది ద్విత్వాక్షరం కదూ!

గన్ – ఇందులో "గ"న్ అనే పొల్లుతో కూడి ఉంది కదూ!

మరి ఇలాంటప్పుడు లఘుగురువులను ఎలా గుర్తించవచ్చునో చూడండి.

| | |
|---|---|
| U I I I | U U U |
| మర్కటము; | సవ్యంగా; |

వీటిలో ఏమి గమనించారు? సంయుక్తాక్షరాల ముందున్న అక్షరాన్ని గురువుగా గుర్తించాం కదూ!

- అంటే సంయుక్తాక్షరం ముందు అక్షరాన్ని గురువుగా గుర్తించాలి.

ఈ కింది పదాలలో గురులఘువులను ఎలా గుర్తిస్తామో చూడండి.

| | | | |
|---|---|---|---|
| U I | U I I | U U I | U U I |
| అమ్మ; | వెచ్చని; | అక్కయ్య; | చొక్కాట |

వీటిలో ద్విత్వాక్షరం ముందు అక్షరాన్ని గురువుగా గుర్తించాం కదూ!


- అంటే సంయుక్తాక్షరం, ద్విత్వాక్షరాల విషయంలో ఒకే విధానాన్ని పాటిస్తాం.

ఇక –

| | | |
|---|---|---|
| I I I U | U I I U | U U U I |
| చదువుచున్; | కారకముల్; | సమ్యక్‌దృష్టి |

- వీటిలో పొల్లు అక్షరంతో కూడి ఉన్న అక్షరాలను గురువుగా గుర్తించాం కదూ!

ఇలా లఘుగురువులను గుర్తించడం అనేది పద్యాలు రాయటానికి ఉపయోగపడే నియమాల్లో మొదటిమెట్టు. మిగిలిన విషయాలను పై తరగతిలో నేర్చుకొంటారు.



**అభ్యాసాలు :** కింది పదాలకు లఘువు, గురువులను గుర్తించండి.

| | | | |
|---|---|---|---|
| గుమ్మెడు; | మునుమును; | మాంసమ్ము; | ఏర్పరచి; |
| పుట్టదె; | తక్కినన్; | వాగ్గత్తము; | పుండరీకము; |
| మనమున; | ఉల్లసిల్లగన్; | యింత యేటికిన్; | వచ్చెదన్; |

## ప్రాజెక్టు పని

**వివిధ భాషాపత్రికల పట్టికను తయారుచేయండి. వాటిలో వచ్చే భాషాక్రీడలు, కథలు, గేయాలు సేకరించి ప్రదర్శించండి.**



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | పత్రిక ఎలా తయారు చేయాలో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పత్రికలను ధారాళంగా చదవగలను. అర్థంచేసుకోగలను. | ఔను / కాదు |
| 3. | పత్రికలోని అంశాలను సొంతమాటల్లో చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 4. | ఏదైనా ఒక చిట్టి పత్రికను సొంతంగా తయారు చేయగలను. | ఔను / కాదు |
| 5. | తెలుసుకున్న నూతన పదాలను అవసరమైన సందర్భాల్లో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 6. | ఏదైనా ఒక సమావేశానికి సంబంధించిన ముఖ్యాంశాలను సొంతంగా రాయగలను. | ఔను / కాదు |
| 7. | సొంతంగా ఆహ్వానపత్రికను, బ్యానరును తయారు చేయగలను. | ఔను / కాదు |

*"కూర్చున్న చోటనే కలలు కంటే ఆశలు నెరవేరవు. ప్రయత్నాలు గట్టిగా చేయాలి"*

యూనిట్-II

# అసదృశుడు

చదువు-ఆనందించు

ఒకసారి బోధిసత్త్వుడు బ్రహ్మదత్తుడి కొడుకుగా పుట్టాడు. ఆయనకు అసదృశ కుమారుడని పేరు పెట్టారు. మూడు నాలుగేళ్ళకు మరో కొడుకు పుట్టాడు. వాడికి బ్రహ్మదత్తుడని పేరుపెట్టారు. అసదృశుడు తక్షశిలకు వెళ్ళి పదహారేళ్ళకే విలువిద్యలో చాలా నేర్పు సంపాదించి కాశీకి తిరిగి వెళ్ళాడు. తండ్రి మరణిస్తూ అసదృశుణ్ణి రాజుగానూ, బ్రహ్మదత్తుణ్ణి ఉపరాజుగానూ చేశాడు. కానీ రాజ్యాన్ని తమ్ముడికి ఇచ్చి, అన్న సామాన్యుడిలా జీవితం గడుపుతున్నాడు. ఎప్పటికైనా, అన్న రాజ్యాన్ని ఆక్రమించుకోవచ్చని, చుట్టు పక్కలవారు దుర్బోధ చేయటంతో తమ్ముడు అన్నను బంధించమని ఆజ్ఞాపిస్తాడు. ఈ సంగతి తెలుసుకుని అసదృశుడు వేరే రాజ్యానికి వెళ్ళాడు. ఏడాదికి లక్షరూపాయల జీతంతో ఆ దేశపు రాజు దగ్గర విలుకాడిగా ఉన్నాడు. అసదృశుడికి ఇంత ధనం రావటంవల్ల అక్కడ అంతకు ముందున్న విలుకాడికి ఈర్ష్య కలిగింది.

ఒకరోజున రాజు తోటకు వెళ్ళి మామిడి చెట్టుకింద అరుగుమీద పడుకున్నాడు. పైకి చూసేసరికి మామిడిపండు కనిపించింది. ఎవరైనా చెట్టెక్కి కోయడానికి అది వీలుగా లేదు. రాజు విలువిద్యలో నేర్పరులను పిలిపించి కాయను కొట్టమంటాడు. వారు మేమెలాగూ కొట్టగలం. మీరు కొత్త విలుకాడిని నియమించుకున్నారు గదా! ఆయన నేర్పు ఏమిటో కూడా చూద్దాం. ఆయనచేత కొట్టించండి అంటారు. రాజు ఆ పని అసదృశ కుమారుడికి అప్పగించాడు. అసదృశ కుమారుడు తెరమాటుకు వెళ్ళి తెల్లబట్టలు విప్పి ఎర్రబట్టలు కట్టుకొని, గోచీ బిగించి, కత్తి ఎడమ పక్క పెట్టుకొని, బంగారు రంగు వస్త్రం కప్పుకొని అమ్ములపొది బిగించి, పొట్టేలు కొమ్ములతో తయారుచేసిన ధనస్సు తీసుకొని, పగడపు రంగు దారం బిగించి, తలపాగా ధరించాడు. పదునుగా ఉన్న భాగాన్ని గోటితో తిప్పుతూ తెరమధ్యను చీల్చుకొని బైటకు వచ్చాడు. రాజుతో – మామిడి పండును పైకిపోయే బాణంతో కొట్టాలా! కిందకు వచ్చే బాణంతో కొట్టాలా! అని అడుగుతాడు. పైకి పోయే బాణంతో కొట్టడం అందరూ చేసే పనే! కిందకు వచ్చే బాణంతో కొట్టడమే గొప్ప. ఇలానే చేయండి అంటాడు రాజు. అసదృశుడు – రాజా! ఈ బాణం ఆకాశంలో ఎంతో దూరం పోతుంది. దేవతలు ఉండే చోటుకు వెళ్తుంది. తిరిగి వచ్చేవరకు మీరు ఎదురు చూడాలి అంటాడు. సరేనంటాడు రాజు. బాణం మామిడి తొడిమను చీల్చుకొని పైకిపోయి, కిందకు వచ్చేటప్పుడు కూడా అదే దారిలో వస్తుందని బాణాన్ని బలంగా విడిచాడు. కొంతసేపటి తర్వాత మరో బాణాన్ని మరింత బలంగా విడుస్తాడు. అది పోయి మొదటి బాణం వెనక రెక్కకు గుచ్చుకుంది. దాన్ని దేవతలు పట్టుకున్నారు.

కిందకు వచ్చే బాణధ్వని పిడుగు చప్పుడులా ఉంది. ఈ చప్పుడు ఏమిటని ప్రజలు అడుగుతారు. బాణం తిరిగి వస్తోందంటాడు అసదృశుడు. తమ మీదే పడుతుందని వాళ్ళు భయపడుతుంటే "కింద పడనివ్వను భయపడకండి" అంటాడు.

తిరిగి వచ్చే బాణం వెంట్రుకవాసి కూడా తప్పకుండా మామిడిపండును కొట్టి తీసుకొస్తుంది. అసదృశుడి ఒక చేతిలో బాణాన్ని, రెండవ చేతిలో పండును చూసి ప్రజలందరూ అతడిని మెచ్చుకుంటారు. రాజపరిషత్తు కోటి రూపాయల ధనమిచ్చి సత్కరిస్తుంది. ఇదిలా ఉంటే – అక్కడ కాశీలో అసదృశుడు లేడని తెలుసుకొని, ఏడుగురు రాజులు నగరాన్ని మహాసేనతో చుట్టుముట్టారు. తమ్ముడు భయపడి అన్న దగ్గరకు దూతని పంపిస్తాడు. అసదృశుడు కాశీకి వచ్చి తమ్ముణ్ణి ఓదార్చి శత్రువుల్ని పారదోలుతాడు. అందరూ సుఖంగా జీవిస్తారు.

యూనిట్-III

# 7. ముత్యాల మూట

## చదవండి - ఆలోచించండి - మాట్లాడండి

అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండుc బల్కుc జల్లగాను
కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ వినురవేమ.

- వేమన

కష్టబెట్టబోకు కన్నతల్లి మనసు
నష్టబెట్టబోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవ సన్నిభులురా
లలిత సుగుణజాల తెలుగుబాల

- 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రి

**ప్రశ్నలు:**

1. ఇలాంటివి మరికొన్ని పద్యాలు చెప్పండి.
2. మీకు తెలిసిన కొన్ని శతకాల పేర్లు చెప్పండి.
3. శతక పద్యాలకు, ఇతర పద్యాలకు తేడా ఉందా ? అదేమిటో చెప్పగలరా?

**ఉద్దేశం:** నైతిక విలువలను పెంపొందింపజేసే వివిధ శతకాల్లోని నీతులను తెలియజేయడమే ప్రస్తుత పాఠ్యభాగ ఉద్దేశం.

ఈ పాఠంలో ఉండే అన్ని పద్యాలను కంఠస్థం చేయండి.

**విద్యార్థులకు సూచనలు:**


1. పాఠం చిత్రాలను చూడండి. పద్యభావాలను ఊహించి చెప్పండి.
2. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
3. అర్థంకాని పదాలను, వాక్యాల గురించి మీ మిత్రులతో చర్చించండి.
4. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి తెలుసుకోండి.


తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



పరహితము లేని సంపద
ధరనెవ్వఁడు గూర్చెనేని దక్కకపోవున్
మురిపెంబున జుంటీగలు
మరి కుడువక గూర్చు తేనె మార్గము సుమతీ! (1)

– బద్దెన




మంచి మాట చాలు మనసులో గాయమ్ము
మాన్పజాలు గొప్ప మందు వోలె
సౌమ్యమైన మాట సంతాపమును బాపు
మాట చూరగొనును మనిషి యెడద (2)

– డా॥ నందూరి రామకృష్ణమాచార్య



సద్గురు కృప జ్ఞానంబున
సద్గతి దీపింపుచున్న చాలా చదువుల్
సద్గతి గలుగగ జేయును
సద్గురువే దైవమనుచుఁ జాటర వేమా (3)

– వేమన




అపకీర్తిం బొందుట క
ష్టపుఁబని గాదొక్క గడియ చాలును కీర్తి
న్నిపుణత వహింపవలయును
జపల గుణములెల్ల బాసి చనగ కుమారా! (4)

– పక్కి అప్పల నరసయ్య



మతనిందల్ వలదా మతాధ్యులకు నీ మాత్రంబు లేకుండునే
మతివాటన్ స్మృతిసమ్మతుల్ గలుగవే మర్యాద నాచార్యుడే
గతి నీకున్ ప్రకటించినట్లు సుగుణైక స్ఫూర్తి నోలాడుచున్
సతతం బెల్లరు ముద్దుసేయ మనసా! సర్వేశు చింతింపవే. (5)

– గురువయ కవి



అక్కఱపాటు వచ్చు సమయంబునఁ జుట్టము లొక్కరొక్కరి
న్మక్కువ నుద్ధరించుటలు మైత్రికిఁ జూడగ యుక్తమే సుమీ
యొక్కట నీటిలో మెరక నోడల బండ్లును బండ్ల నోడలన్
దక్కక వచ్చుచుండుట నిదానముగాదె తలంప భాస్కరా! (6)

– మారద వెంకయ్య



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**కవిపరిచయం:**

| కవి | కాలము | రచన |
|---|---|---|
| బద్దెన | 13వ శతాబ్దం | సుమతి శతకం |
| పక్కి అప్పల నర్సయ్య | 16వశతాబ్దం | కుమార శతకం |
| వేమన | 17వశతాబ్దం | వేమన పద్యాలు |
| మారద వెంకయ్య | 17వశతాబ్దం | భాస్కరశతకం |
| గురువయకవి | 18వశతాబ్దం | మనోబోధశతకం |
| డా॥నందూరి రామకృష్ణమాచార్యులు | 20వశతాబ్దం | ప్రగతిగీత |

**పద్యభావాలు :**

1. పరులకు మేలు చేయని సంపద భూమిపై ఎవ్వరు కూడబెట్టినా దక్కదు. తాము తినక సంతోషముగా తేనెటీగలు కూడ బెట్టిన తేనె బాటసారుల పాలవుతుంది కదా!
2. మనసులోని గాయాన్ని పరమౌషధమువలె మాన్పివేయటానికి మంచిమాటచాలు. సౌమ్యమైనమాట సంతాపమును పోగొట్టి మనిషి హృదయమును చూరగొనును.
3. మంచి గురువు అనుగ్రహము వలన జ్ఞానము, మంచి మార్గములు దీపిస్తూ ఆయా చదువులు మంచిగతులను కలగజేస్తాయి. అలా సద్గతులను చూపే గురువును దైవమని భావించు.
4. చెడ్డపేరు సంపాదించడానికి ఒక క్షణకాలము చాలును. మంచిపేరు తెచ్చుకోవాలంటే ఎంతోకాలం ఓర్పు వహించి, మనసుకు సంబంధించిన చపల గుణాలన్నీ వదిలితేగాని సాధ్యం కాదు.
5. ఏ మతస్థులకైనా ఇతర మతస్తుల్ని నిందించాలనే ఆలోచన ఉండకూడదు. ఆచార్యుడు బోధించిన విధంగా మంచి గుణాల స్ఫూర్తితో ఎప్పుడూ అందరూ కీర్తించే విధంగా సర్వేశ్వరుని గూర్చి చింతన చేయాలి.
6. ఒకానొక సమయంలో నీటిలో పడవలమీద బండ్లూ, మెరకభూమిలో బండ్లమీద పడవలూ వస్తూండటం నిజం. అట్లే తగిన అవసరం వచ్చే సమయంలో బంధువులు ఒకరిని ఒకరు కాపాడుకోవడం స్నేహమునకు మంచిది.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



అ) పాఠంలోని పద్యాలను రాగంతో పాడండి. భావం చెప్పండి.

ఆ) పాఠంలో మీకు నచ్చిన విషయం గురించి చెప్పండి.

ఇ) మీకు తెలిసిన ఇతర మతాలు ఏవో చెప్పండి.

ఈ) మంచిపేరు తెచ్చుకోవడానికి ఏం చేయాలో చెప్పండి.

## II. చదవడం, అవగాహన చేసుకోవడం



**1) కింది పద్యపాదాలు ఏయే పద్యాలలో ఉన్నాయి? ఆ పాదానికి భావమేమిటో రాయండి.**

అ) సద్గురువే దైవమనుచు జాటర వేమా!

భావం : ______________________________

ఆ) సతతం బెల్లరు ముద్దు సేయ మనసా సర్వేశు చింతింపవే.

భావం : ______________________________

ఇ) కష్టపుఁబనిగాదొక్క గడియ చాలును.

భావం : ______________________________

ఈ) అక్కఱపాటు వచ్చు సమయంబున

భావం : ______________________________

ఉ) మాట చూరగొనును మనిషి యెడద.

భావం : ______________________________

**2) కింది గద్యాన్ని చదివి ఐదు ప్రశ్నలు తయారు చేయండి.**

భిన్నత్వంలో ఏకత్వాన్ని గురించి మాట్లాడవలసి వస్తే ప్రపంచంలో ఎవరైనా సరే, భారతదేశాన్ని గురించి తప్పకుండా ప్రస్తావిస్తారు. కారణమేమంటే మన దేశంలో ఉన్నన్ని మతాలు, భాషలు, విశ్వాసాలు అభివృద్ధి చెందుతున్న ఏ ఇతర దేశంలోనూ లేవు. భారతదేశం తరతమ భేదాలు లేకుండా అన్ని మతాలవారికి సమాన హక్కులు ఇచ్చి, అందరూ అన్నదమ్ముల్లా మెలగడానికి ఎంతో దోహదం చేస్తున్నది.

**3) కింది పద్యపాదాలను క్రమ పద్ధతిలో అమర్చి భావం రాయండి.**

సౌమ్యమైన మాట సంతాపమును బాపు

మాన్పజాలు గొప్ప మందువోలె

మాట చూర గొనును మనిషి యెడద

మంచిమాట చాలు మనసులో గాయమ్ము.

పద్యం :- ______________________________

______________________________

______________________________


______________________________

భావం :- ______________________________

______________________________

______________________________

______________________________



**4. కింది ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి.**

అ) పరులకు మేలు చేయని సంపద ఏమవుతుంది?

ఆ) మనసులోని గాయాన్ని మాన్పేది ఏది?

ఇ) ఎవరిని దైవంగా భావించాలి?

ఈ) వేటిని వదిలి పెడితేగాని మంచి పేరు రాదు?

ఉ) సుమతి శతకం రాసినదెవరు?

## III. స్వీయరచన



**1) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) పరులకు మేలు చేయని సంపద ఎలాంటిదని బద్దెన అంటున్నాడు?

ఆ) మాటతీరు ఎలా ఉంటే బాగుంటుందని మీరనుకుంటున్నారో రాయండి.

ఇ) మంచిపేరు రావాలంటే ఏం చేయాలి?

ఈ) బంధువులు ఎలా మెలగాలని మీరనుకుంటున్నారు?

ఉ) మంచి గురువు ఎలా ఉండాలని మీరనుకుంటున్నారు?

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానం రాయండి.**

అ) సంపదను ఎలా సద్వినియోగం చేసుకోవాలో రాయండి.

ఆ) 'సౌమ్యమైన మాట' సంతాపమును బాపు' దీన్ని మీరెలా సమర్థిస్తారు?

ఇ) మతసామరస్యం నెలకొల్పుటకు మీరేం చేస్తారు?

## IV. పదజాలం



**1) కింది పదాలలోని అక్షరాల ఆధారంగా వీలైనన్ని పదాలు రాయండి.**

ఉదా॥ పసిడి పంటలు, లలిత కళలు


పసిడి తలలు కళ

**2) పరహితం, సతతం, మంచిమాట వీటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

______________________________________________

______________________________________________

______________________________________________



**3) కింది పదాలకు సరైన అర్థాలను గుర్తించి దాని కింద గీత గీయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| అ) | అక్కఱపాటు | = | అనవసరము, | అవసరము, | రెప్పపాటు |
| ఆ) | మెరక | = | మెట్టభూమి, | కొండ, | లోయ |
| ఇ) | తలంచు | = | తలవంచు, | ఆలోచించు, | చలించు |
| ఈ) | యుక్తము | = | తగినది, | తగనిది, | తెగినది |
| ఉ) | ధరణి | = | భూమి, | దారి, | ధర్మం |
| ఊ) | జుంటీగలు | = | జోరీగలు, | ఈగలు, | తేనెటీగలు |
| ఋ) | మందు | = | ముందు, | మంద, | ఔషధం |

**4) కింది ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను గుర్తించి రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| అ) | కీర్తి | = | ____________ | (కీరితి, కిరీతి) |
| ఆ) | హృదయము | = | ____________ | (ఎత, ఎడద) |
| ఇ) | శ్రీ | = | ____________ | (శిరి, సిరి) |
| ఈ)7 | గుణము | = | ____________ | (గొనము, గానము) |
| ఉ) | ఉపాధ్యాయుడు | = | ____________ | (పంతులు, ఒజ్జ) |
| ఊ) | స్నేహము | = | ____________ | (నెయ్యము, సన్నాహము) |



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## V. సృజనాత్మకత



**మాధవి టీచర్ తెలుగు బోధిస్తుంటే ఇంకా వినాలని అనిపిస్తుంది. పద్యమైనా గద్యమైనా వినుటకు ఆనందంగా ఉంటుంది. ఈ విషయాన్ని వివరిస్తూ మీ స్నేహితునికి లేఖ రాయండి.**

## VI. ప్రశంస



**కింది వాటిలో ఏదైనా ఒకటి చేయండి.**

అ) శతక పద్యాలలోని భావాలను ప్రశంసిస్తూ రాయండి.

ఆ) మీకు తెలిసిన మంచివారిని గురించి చెప్పండి. మీరు కూడా మంచిపేరు తెచ్చుకోవాలంటే ఏం చేస్తారో తెల్పండి.

## VII. భాషాంశాలు



### 1. కింది పదాలను విడదీయండి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ రాజేంద్రుడు | = | రాజ + ఇంద్రుడు | (అ + ఇ = ఏ) |
| అ. గజేంద్రుడు | = | ...... + ........ | ( ) |
| ఆ. మహేంద్రుడు | = | ...... + ........ | ( ) |
| ఇ. నరేంద్రుడు | = | ...... + ........ | ( ) |
| ఉదా॥ పరోపకారం | = | పర + ఉపకారం | (అ + ఉ = ఓ) |
| ఈ. మహోన్నతి | = | ...... + ........ | ( ) |
| ఉ. దేశోన్నతి | = | ...... + ........ | ( ) |
| ఊ. గృహోపకరణం | = | ...... + ........ | ( ) |
| ఉదా॥ మహర్షి | = | మహా + ఋషి | (ఆ + ఋ = అర్) |
| ఎ. రాజర్షి | = | ...... + ........ | ( ) |

పైన పేర్కొన్న పదాలను 3 రకాలుగా విడదీయడం సాధ్యమైంది. అవి....

అ/ఆ + ఇ/ఈ = ఏ, అ/ఆ + ఉ/ఊ = ఓ, అ/ఆ + ఋ/ౠ = అర్

మూడు సందర్భాల్లోనూ, పూర్వస్వరం 'అ / ఆ'; పరస్వరం స్థానంలో ఇ, ఉ, ఋ లు వచ్చాయి. 'ఇ' కలిసినపుడు 'ఏ'; 'ఉ' కలిసినపుడు 'ఓ'; 'ఋ' కలిసినపుడు 'అర్' ఆదేశంగా వచ్చాయి కదా!

'ఏ, ఓ, అర్'లను గుణాలు అంటారు. గుణాలు ఆదేశంగా వచ్చే సంధిని గుణసంధి అంటారు.

ఈ కింది పదాలను కలిపి, సంధి ఏర్పడ్డ విధానాన్ని చర్చించండి.

ఉదా॥ రాజ + ఉత్తముడు = (అ + ఉ = ఓ)   రాజోత్తముడు

అ) నర + ఇంద్రుడు =

ఆ) మహా + ఈశ్వరుడు =

ఇ) దేవ + ఋషి =

ఈ) స్వాతంత్ర్య + ఉద్యమం =

ఉ) రామ + ఈశ్వరం =

ఊ) ఇతర + ఇతర =

## 2. కింద వాటిని రాయండి.

| | సమాస పదం | విగ్రహవాక్యం | సమాసం పేరు |
|---|---|---|---|
| అ) | భీమార్జునులు | ____________ | ____________ |
| ఆ) | ____________ | నాలుగు సంఖ్యగల దిక్కులు | ____________ |
| ఇ) | బంధువనోడలు | ____________ | ____________ |
| ఈ) | పంచపాండవులు | ____________ | ____________ |

**అ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

అ) నీవుడక్కరి - ____________ + ____________

ఆ) అపుడుసనియె - ____________ + ____________

ఇ) మాయమ్మ - ____________ + ____________

ఈ) మీయన్న - ____________ + ____________



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## ప్రాజెక్టు పని

**కింది వానిలో ఏదైనా ఒకటి చేయండి.**

1. నీతిపద్యాలు సేకరించి ప్రార్థన సమయంలో చెప్పండి.
2. శతక కవులు చెప్పిన సూక్తులు సేకరించి గోడపత్రికలో ఉంచండి.




## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగంతో పాడగలను, భావం చెప్పగలను | ఔను / కాదు |
| 2. | పద్యం చదివి, భావాన్ని రాయగలను. | ఔను / కాదు |
| 3. | పద్యభావాలను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | వ్యాకరణాంశాల గురించి లేఖ రాయగలను. | ఔను / కాదు |

*"మంచి మాట చెప్పలేకపోతే*
*మౌనంగా ఉండటం మంచిది"*



యూనిట్-III

# 8.పట్టణ సమస్యలు

**చదవండి - ఆలోచించండి - మాట్లాడండి**

సీ॥ అందాలు ఎన్నున్న, అసలైన స్వచ్ఛత
నాస్తియై నలుగును, నగరవాసి
రణగొణ ధ్వనితోడ, రగిలెడి సెగతోడ
పొగులుచుండెడివాడు, నగరవాసి
పద్మవ్యూహమువంటి, వాహన శ్రేణితో
నష్టపోయెడి వాడు, నగరవాసి
ఆకాశమును తాకు, అధికమౌ ధరలతో
అగచాట్ల పాలౌను, నగరవాసి
గీ॥ ఇరుకిరుకుగా గదులు, యరకొర వసతులు
అదుపులేకుండ పెరిగెడి, అధిక జనము
కలుషిత మవుతున్న జలము, గాలి కలిగి
నలిగి పోయెడి వాడెగా, నగర వాసి.

**ప్రశ్నలు:**

1. పై పద్యంలో ఎవరిని గురించి/ దేన్ని గురించి ఉంది?
2. నగరవాసి పరిస్థితి ఎలా ఉంటుంది?
3. నగరవాసి ఇంకా ఏ ఏ సమస్యలు ఎదుర్కొంటాడు?

**ఉద్దేశం:** సువిశాలమైన భారతదేశంలో గల ముఖ్య పట్టణాలు, మహా నగరాలు రోజు రోజుకూ విస్తరిస్తున్నాయి. విస్తరిస్తున్న నగరాలకు కారణం పెరుగుతున్న జనాభా. జనాభా పెరగడంవల్ల రకరకాల సమస్యలు ఏర్పడి అందర్నీ బాధిస్తున్నాయి. ఆ సమస్యలేమిటో, వాటివల్ల జరిగే నష్టాలేమిటో తెలుపుటయే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠం చిత్రాల గురించి మాట్లాడండి.
2. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
3. అర్థంకాని పదాలను, వాక్యాల గురించి మీ మిత్రులతో చర్చించండి.
4. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి తెలుసుకోండి.



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ


ఎండాకాలం వచ్చేసింది. వార్షిక పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులను ఆనందంగా గడుపుదామని, పట్నానికి వెళ్ళడానికి నిశ్చయించుకొని, తమను తీసుకువెళ్ళడానికి నగరంలో నివసిస్తున్న మామయ్యకు ఉత్తరం రాశారు కీర్తి, కిరణ్‌లు. వాళ్ళను తీసుకువెళ్ళడానికి రామాపురానికి వచ్చిన వాళ్ళ మామయ్య అరుణ్, కీర్తి, కిరణ్‌ల తల్లిదండ్రులతో మాట్లాడి, వారిని తనతో పాటు పట్నానికి తీసుకొని బస్సులో బయల్దేరుతాడు. బస్సు నగరం చేరుకుంది. హఠాత్తుగా బస్సు ఆగింది ....... ఇక చదవండి ........)

**కిరణ్** : మామయ్యా ! బస్సు ఎందుకాగింది?

**అరుణ్** : (బయటకు తొంగిచూసి) ఏం లేదు కిరణ్, మనం పట్నానికి దగ్గరగా వచ్చేశాం. ట్రాఫిక్ సమస్యతో మనం ఎక్కి వచ్చిన బస్సు ఆగింది.

**కిరణ్** : మామయ్యా ట్రాఫిక్ సమస్య అంటే !

**అరుణ్** : నగరాల్లో ప్రతిరోజూ ప్రయాణించే వేలాది వాహనాలు రకరకాల కారణాలవల్ల రోడ్లపై ఆగిపోతూంటాయి. అందువల్ల వెనక వచ్చే వాహనాలుకూడా ఇలా ఆగుతుంటాయి. ఈ ఆగడం ఒక్కోసారి గంటల తరబడి కూడా ఉంటుంది. ఈ ట్రాఫిక్ ఎప్పుడు క్లియర్ అవుతుందో అని వాహనదారులు 'కళ్ళు కాయలు కాచేలా' ఎదురు చూస్తూంటారు. అప్పుడు వాళ్ళు పద్మవ్యూహంలో చిక్కినట్లు ఎటూ పోలేకపోతారు.



కీర్తి : అమ్మో! గంటల తరబడి ఆగాలా! రాత్రీపగలూ ఇంతేనా? ఇలా ఐతే పాఠశాలకు, కార్యాలయాలకు వెళ్ళేవారికి ఇబ్బందులు రావా?

అరుణ్ : ఎందుకు రావు? తప్పకుండా వస్తాయి. మహానగరాల్లో ప్రతి నిత్యం జరుగుతున్నది ఇదే. మేము ఈ కష్టాలను ప్రతిరోజూ ఎదుర్కొంటున్నాం.

కిరణ్ : అయితే మామయ్యా ! ఈ ట్రాఫిక్ కష్టాలను తొలగించడానికి ఎవరైనా ప్రయత్నిస్తారా? ఎటువంటి ప్రయత్నం జరుగుతుంది?

అరుణ్ : బాగా అడిగావు కిరణ్. అయితే ప్రభుత్వం ఈ సమస్య నివారణకై ప్రధాన రహదారి కూడళ్ళ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి (వంతెన)లను నిర్మిస్తూంది. అయినా రోజు రోజుకూ తామరతంపరగా పెరుగుతున్న జనాభా కారణంగా అవి కూడా సరిపోవడంలేదు.

(ఇంతలో ట్రాఫిక్ క్లియర్ అవుతుంది. వీళ్ళెక్కివస్తున్న బస్సు బయల్దేరి గమ్యం చేరుతుంది.)

అరుణ్ : కీర్తి! కిరణ్! మీ బ్యాగులను తీసుకొని జాగ్రత్తగా బస్సు దిగండి.

(కీర్తి, కిరణ్, అరుణ్ బస్సుదిగి, ఆటో మాట్లాడుకొని తమ ఇంటికి వెళ్తూంటారు. ఆటో బయల్దేరి కొద్ది దూరం వెళ్ళిన తర్వాత, నెమ్మదిగా వెళ్ళి ఒక చోట ఆగిపోతుంది.)

అరుణ్ : ఏమైంది? ఆటో ఎందుకాపావు?

ఆటో డ్రైవర్ : ఏం లేదు సార్, రెండు గంటల క్రితం ఇక్కడ భారీవర్షం కురిసింది. దాంతో రోడ్లన్నీ 'జామ్' అయినాయి. అందుకే ముందున్న వాహనాలు ఆగాయి. నేనూ ఆటో ఆపవలసి వచ్చింది.

కీర్తి : అరుణ్ మామయ్యా! ఈ 'జామ్' అంటే ఏమిటి?

అరుణ్ : ఏంలేదమ్మా! పట్నాల్లో కురిసిన భారీవర్షానికి చేరిన వరదనీరు పోయే సౌకర్యం సరిగ్గా లేక రోడ్లపై నిల్చి వాహనదారులకు రోడ్డు సరిగా కన్పించక మెల్లగా నడుపుతారు. నీళ్ళు మరీ ఎక్కువగా ఉంటే ఒక్కోసారి వాహనాలను ఆపేస్తుంటారు. వెనుక వాహనాలు కూడా తప్పకుండా ఆపాల్సిందే. అపుడా వరుస 'కొండవీటి చేంతాడు'లా పొడుగ్గా ఉంటుంది. ఇలా ఆగిపోవడమే 'ట్రాఫిక్ జామ్'

(కొంతసేపటికి రోడ్లపై నిల్చిన నీరు తగ్గి ఆటో బయల్దేరి, వాళ్ళు ఇంటికి చేరుకుంటారు. అత్తయ్య మాధవి (అరుణ్ భార్య) ఎదురుగా వచ్చి)

మాధవి : రండి రండి ఏం కీర్తీ, ఏరా కిరణ్ బాగున్నారా? ఇంత ఆలస్యమైందేం? ఊళ్ళో మీ అమ్మానాన్నా అందరూ బాగున్నారా?

కీర్తి : ఊళ్ళో అందరూ బాగున్నారత్తయ్యా! ఊరి నుంచి మేమెప్పుడో బయల్దేరాం. పట్నానికి అప్పుడే చేరుకున్నాం. కాని ఇక్కడే ట్రాఫిక్ జామ్‌వల్ల, చెరువుల్లాగా మారిన రోడ్లవల్ల ఆలస్యమైంది. ఈ పట్నంలో ఇదొక్కటేనా సమస్యా? మరేమైనా ఉన్నాయా?

మాధవి : ఎందు కడుగాతావమ్మా కీర్తీ ! నగరంలో ప్రస్తుతం అడుగడునా సమస్యలే. మధ్యతరగతి ప్రజలకు, పేదవారికి చాలా సమస్యలున్నాయి.

అరుణ్ : అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం, కాని ముందు మీరు స్నానాలు చేయండి కీర్తీ, కిరణ్! నీవు త్వరగా వంట చెయ్యి మాధవీ!


**మాధవి** : అలాగేనండీ, అరగంటలో వంట చేసేస్తాను.

(వంట పూర్తౌతుంది. అందరూ భోజనాలు చేసి విశ్రమిస్తారు. మరుసటిరోజు సాయంత్రం 4 గం॥లు...)

**అరుణ్** : కీర్తి! కిరణ్! బయల్దేరండి నేను మీకు పట్నమంతా తిప్పి చూపిస్తాను. (వాళ్ళంతా బయల్దేరి రోడ్డు మీదకి రాగానే)

**కీర్తి** : మామయ్యా! ఏమిటీ ఈ చెడువాసన! ఈ చెత్తా చెదారం అంతా రోడ్డుపైన ఎక్కడిది? జనం ఆరోగ్యం పాడైపోదా?

**అరుణ్** : ఓ అదా! పట్నంలో నివసించే ప్రతి ఇంటిలోని వాళ్ళు చెత్తను కుండిలో పడేయకుండా ఎక్కడంటే అక్కడ వేయడం వల్ల కుళ్ళిన, పాడైన కూరగాయలు అన్నం పారవేయడంవల్ల చెత్తకుండీలు అన్నీ నిండినా వాటి పక్కనే పారేయడంవల్ల ఇలా దుర్వాసన, చెత్త అందర్నీ బాధిస్తాయి.



| | | |
|---|---|---|
| **కిరణ్** | : | మామయ్యా; ఈ సమస్యకు పరిష్కారం లేదా? |
| **అరుణ్** | : | ఎందుకులేదు ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని ప్రతి వీధిలో చెత్తను ప్రతి నిత్యం శుభ్రం చేయడం డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం వల్లా ఈ సమస్య నివారణ అవుతుంది. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడి వాళ్ళు హాయిగా ఊపిరిపీల్చుకుంటారు. ప్రజలు కూడా అందుకు సహకరించాలి. |
| **కీర్తి** | : | మామయ్యా, చూస్తుంటే నగరంలో సమస్యలు ఎక్కువే ....! |
| **అరుణ్** | : | అంతే కాదమ్మా! తాగునీటి సమస్యలు, కాలుష్యం, ధర్నాలు, బంద్‌లు మొదలైనవి. అయినా, నగరంలో జీవిస్తున్న వాళ్ళకివి తప్పవుగా. |
| **కిరణ్** | : | అయితే మామయ్యా! ఇన్ని సమస్యలతో ఈ పట్నాలలో ఇంతమంది ఎందుకు జీవిస్తున్నారు? వాళ్ళు కూడా మాలాగ పల్లెటూళ్లలో ఉండొచ్చుగా! అలా ఉంటే ఇన్ని కష్టాలుండవుగా! |
| **అరుణ్** | : | నీవన్నది నిజమే కిరణ్, కాని రకరకాల కారణాలవల్ల నగరాల జనాభా పెరిగిపోతున్నది. జనాభా పెరగడం వల్ల ఇటువంటి సమస్యలు తలెత్తుతాయి. |
| **కీర్తి** | : | రకరకాల కారణాలా? అవేంటి మామయ్యా! |
| **అరుణ్** | : | ప్రస్తుతం దేశంలో పెరిగిపోతున్న కాలుష్యంవల్ల, సకాలంలో వర్షాలు కురియడంలేదు. వర్షాలు లేక, పంటలు పండక పల్లెటూరి జనమంతా పట్నాలకు ఉపాధికై వలస వస్తున్నారు. వారంతా నగర శివార్లలో గుడిసెలు ఏర్పాటు చేసుకొని, కాయకష్టం చేసుకొని జీవితాన్ని గడిపేస్తుంటారు. క్రమంగా వారి నివాసాలు సరైన సౌకర్యాలు లేని 'మురికి వాడలుగా' మారతాయి. |
| **కిరణ్** | : | ఇంకా ఏకారణం చేత జనాభా పెరుగుతుందో చెప్పు మామయ్యా! |
| **అరుణ్** | : | నగరాలకు ఉపాధికై వచ్చే సామాన్యజనమే కాదు. చదువు కోసం వచ్చే విద్యార్థులు ఉద్యోగాల కొరకు వచ్చే నిరుద్యోగులు, వారికుటుంబాలు, వైద్యం కోసం వచ్చే రోగులు వారి సహాయకులు, ఇక్కడి నుంచి దేశ విదేశాలకు వెళ్ళడానికివచ్చే ప్రయాణీకుల వల్ల నగరాల జనాభా పెరుగుతుంది. కాలుష్యమూ పెరుగుతుంది. |
| **కిరణ్** | : | కాలుష్యమా! కాలుష్య మంటే ఏంటి? అది ఎన్ని రకాలుగా ఉంటుంది? |
| **అరుణ్** | : | కాలుష్యమంటే స్వచ్ఛంగా ప్రకృతి సిద్ధంగా ఉన్నదంతా మలినమై పోవడం. ఈ కాలుష్యం వల్ల చాలా నష్టాలున్నాయి. ఈ కాలుష్యం శబ్ద, వాయు, జల, భూకాలుష్యాలని రకరకాలుగా ఉంటుంది. |
| **కీర్తి** | : | కాలుష్యాలు నష్టాలను కల్గిస్తాయా? ఆ నష్టాలను నివారించాలనుంది. |
| **అరుణ్** | : | కీర్తి, కిరణ్ జాగ్రత్తగా వినండి. ఇందులో మీకు చాలా విషయాలు తెలిసినవే. |

1) వాహనాలు హారన్‌లను ఎక్కువ శబ్దంతో మోగించడంవల్ల, లౌడ్‌స్పీకర్‌లలో ఎక్కువ శబ్దాలను విన్పించడం వల్ల, టపాకాయలు కాల్చడంవల్ల, ఫ్యాక్టరీలు, యంత్రాలు, జనరేటర్‌లు, విమాన ప్రయాణాల వల్ల శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది.

2) వ్యర్థ రసాయనాలను, ఫ్యాక్టరీలనుండి వెలువరించడం వల్ల, జల ప్రవాహాలు, నదులు, కాలువల్లో వ్యర్థాలను కలపడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుంది.

3) అడవులను నరికి ఉపయోగించడం, పంటలపై రసాయన ఎరువులను ఉపయోగించడం, పురుగు మందులు చల్లడంవల్ల, వ్యర్థాలను సందర్శనస్థలాల్లో, సముద్రతీరాల్లో వదలి వేయడంవల్ల భూకాలుష్యం ఏర్పడుతుంది.

4) పొగ, దుమ్ము ధూళివల్ల, సూర్యకాంతి వేడివల్ల, కరుగుతున్న ఓజోన్‌పొరవల్ల, బొగ్గును మండించడం వల్ల, యుద్ధాలలో బాంబులనుపయోగించడంవల్ల వాయు కాలుష్యం ఏర్పడుతుంది. వీటన్నిటివల్ల పర్యావరణం కలుషితమై, మానసిక ఆందోళనలు,శ్వాసకోశ వ్యాధులు, చర్మరోగాల వంటి అనారోగ్యాలే కాక సకాలంలో వర్షాలు రాక కరువు ఏర్పడడం వంటి సమస్యలేర్పడతాయి.

**కిరణ్** : అయితే మామయ్యా! పర్యావరణాన్ని కాపాడడానికి మనమేం చేయాలి?

**అరుణ్** : విశ్వమానవ శ్రేయస్సుకై పర్యావరణాన్ని కాపాడడానికి మనం కొన్ని పనులు చేయాలి. అవేంటంటే

1. చెట్లను నాటి, వాటిని సంరక్షించి, పెంచి పెద్ద చేయాలి. అలా చేస్తే అవి మనకు తోడునీడలు గా నిలుస్తాయి.
2. నీటిని పొదుపుగా వాడాలి.
3. కాగితాల రీసైక్లింగ్ ద్వారా చెట్లను నరికివేతనుండి కాపాడాలి.
4. వర్షపునీటిని భూమిలో ఇంకేట్లుగా చేసి భూగర్భ జలమట్టాలను పెంచాలి.
5. సొంత వాహనాల వాడకం తగ్గించి ప్రజారవాణా సంస్థలలో (బస్సులు, రైళ్ళు, ఆటోలు మొ॥వి) ఉపయోగించి ప్రయాణించాలి.
6. వాహనాలలో స్వచ్ఛమైన, కాలుష్యరహిత ఇంధనాలనే వాడాలి. వాహనాలను క్రమంతప్పకుండా పొల్యుషన్ చెకప్ (కాలుష్య పరీక్షలు) చేయించాలి.
7. ఇంటిలో వెలువడే చెత్తను వేరువేరుగా చేసి ఉపయోగకరమైనవాటితో ఎరువులను తయారు చేయాలి.
8. చెట్ల ఆకులను కాల్చకుండా భూమిలో కలిసేటట్లు చేయడం ద్వారా భూమికి ఎరువును, బలాన్ని కల్గించాలి.
9. చెత్తను ఎక్కడంటే అక్కడ పడేయకుండా చెత్తకుండీలలోనే వేయాలి.
10. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగ్‌ల స్థానంలో బట్టతో లేదా కాగితాలతో తయారైన సంచులనే వాడాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు పనికి రాక పోయినచో సరైన రీతిలోనే ధ్వంసం చేయాలి.

**కీర్తి** : తాగునీటి సమస్యలన్నావుగా మామయ్యా! అవి ఎలా ఉంటాయి?

**అరుణ్** : పెరుగుతున్న నగరాల జనాభా కవసరమైన తాగు నీటిని జీవనదులు, ఉపనదులు, జలాశయాల ద్వారా నగరాలకు ప్రభుత్వం అందిస్తున్నా సరిపోవడంలేదు. పైపులద్వారా ఈ సరఫరా జరగడం వల్ల అక్కడక్కడ అప్పుడప్పుడు కలుషితమయ్యే ప్రమాదం లేకపోలేదు. అయితే ఆ నీటిని ఫిల్టర్ చేసి, క్లోరినేషన్ చేసి ప్రభుత్వం అందిస్తుంది. జాగ్రత్తగా వాటిని గమనించి వాడుకొని ప్రజలు ఆరోగ్యం కాపాడుకోవచ్చు.

**కీర్తి** : మరి ధర్నాలు, బంద్‌లవల్ల ఏర్పడే సమస్యలేవి?

**అరుణ్** : ధర్నాలు బంద్‌లు కొన్ని ప్రజాసమస్యల సాధనకై కొందరు చేసేవి. వాటివల్ల జనం రద్దీ, ట్రాఫిక్ సమస్య, శబ్దకాలుష్యం ఏర్పడతాయి.

**కిరణ్** : అయితే మామయ్యా! పట్నాలకంటే పల్లెటూళ్ళేనయంకదా!

**అరుణ్** : ఏ స్థలమైనా పర్యావరణాన్ని పరిరక్షించుకొనే ప్రజలుంటే అందరికీ క్షేమం కలుగుతుంది. ఎక్కడైనా, ఏ సమస్యలైనా, మనం సృష్టించుకున్నవే. వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి.

# ఇవి చేయండి

## I. వినడం-మాట్లాడడం



అ) ఈనాడు నగరాల్లోని ప్రధాన సమస్యల్ని కొన్నింటిని చెప్పండి.

ఆ) పట్టణాల్లోని ప్రధాన రోడ్లపై ఏర్పడే 'ట్రాఫిక్ జామ్' కు కొన్ని కారణాలు తెల్పండి.

ఇ) కింది అంశం గురించి చర్చలో పాల్గొనండి.

"పల్లె గొప్పదా? పట్నం గొప్పదా?"


## II. చదవడం, అవగాహన చేసుకోవడం



1) కింది పద్యం చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

సీ ॥ మన పరిసరములు, మలినమ్ములగుటకు
కాలుష్యమనునది, కారణమ్ము
ఫ్యాక్టరీల సెగలు, వాహనాల పొగలు
వాయు కాలుష్యమే, చేయగలవు
వ్యర్థ రసాయనాల్, వదులుచుండుట చేత
జలమున కలుషమ్ము, కలియుచుండ
అవసరమే లేని, అతిపెద్ద ధ్వనులతో
శబ్ద కాలుష్యమ్ము, జరుగుచుండు

గీ ॥ నిట్టి కాలుష్యమును మట్టుబెట్టు కొరకు
పచ్చదనమిచ్చు చెట్లను పాదుకొలిపి
పరిసరమ్ముల పరిశుభ్ర, పరచుకొనిన
మించు కాలుష్యమది యంతరించగలదు.



ప్రశ్నలు :-

అ) పరిసరాలు మలినమగుటకు కారణమేమి?
ఆ) వాయుకాలుష్యం ఎలా ఏర్పడుతుంది?
ఇ) నీరు కలుషితం ఎందుకు అవుతుంది?
ఈ) శబ్దకాలుష్యానికి కారణం తెల్పండి?
ఉ) చెట్లు ఎలా మేలు చేస్తాయి?



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## 2) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి

అ) పట్టణాల్లో నేడు కన్పిస్తున్న ప్రధాన సమస్యలను పాఠం ఆధారంగా రాయండి.

ఆ) ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుటకు కొన్ని కారణాలు రాయండి.

ఇ) వర్షపు నీరు రోడ్లపై నిల్చి చెరువుల్లా కన్పిస్తే ఏర్పడే ఇబ్బందులు ఎలా ఉంటాయి?

# III. స్వీయరచన



## 1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోవడం వల్ల ఏర్పడే కష్టాలేవి? నష్టాలేవి? గుర్తించి రాయండి.

ఆ) అధిక జనాభా వల్ల భవిష్యత్తులో ఏర్పడే మరిన్ని సమస్యలేవో రాయండి.

ఇ) వరదలు వచ్చి మీ ప్రాంతమంతా నీటితో నిండిపోతే, మీకు కలిగే ఇబ్బందులేమిటో రాయండి?

## 2. కింద ప్రశ్నలకు పదేసి వాక్యాలలో జవాబులు రాయండి.

అ) పట్టణాలలో జనాభా ఎందువల్ల పెరుగుతుంది? దీన్ని నివారించుటకు చేపట్టే చర్యలేవి?

ఆ) ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడకపోతే నష్టం ఏర్పడుతుంది. దీన్ని కాపాడడానికి మీరైతే ఏం చేస్తారు?

# IV. పదజాలం



## 1) కింది పదాలు చదవండి. వీటితో పట్టణాల్లోని ప్రధాన సమస్యల్ని వాక్యాలుగా రాయండి.

ట్రాఫిక్ సమస్యలు, జలమయం, భారీవర్షం, చెత్తకుండీ, నగరశివారు, డ్రైనేజీవ్యవస్థ, జీవనోపాధి, పర్యావరణం, వేలాది నగరాలు.

ఉదా॥ అ) వాక్యం : మహానగరాల రోడ్లపై రోజూ <u>వేలాది వాహనాలు</u> తిరుగుతాయి.

ఆ) ______________________

ఇ) ______________________

ఈ) ______________________

ఉ) ______________________

ఊ) ______________________

ఋ) ______________________

ౠ) ______________________

ఎ) ______________________

ఏ) ______________________

**2) మీరు చదివిన పాఠంలో వచ్చిన అన్యభాషాపదాలను గుర్తించి రాయండి. వాటిని వాక్యాలలో ప్రయోగించండి.**

ఉదా॥ బస్సు, రోడ్డు, బంద్, ట్రాఫిక్, జామ్ మొదలగునవి.

అ) బస్సు: బస్సులో ప్రయాణం చేసేటప్పుడు తల, చేతులు కిటికీలోంచి బయట పెట్టవద్దు.

ఆ) ______

ఇ) ______

ఈ) ______

ఉ) ______

ఊ) ______

ఋ) ______

**3) కింద ఇచ్చిన పట్టణ ప్రధాన సమస్యలను వర్గీకరించి పట్టికలో రాయండి.**

జనాభా విస్తరించడం, ట్రాఫిక్ జామ్ అవడం, చెత్తకుండీలు నిండడం, రోడ్లన్నీ జలమయం, తాగునీరు కలుషితం, నివాసాలకు స్థలం లేకపోవడం, జరిమానా విధించడం, టపాకాయలు కాల్చడం, రసాయన వ్యర్థాలు వదలడం, పురుగు మందులు చల్లడం, అడవులను నరికివేయడం, ప్లాస్టిక్ కవర్లు వాడడం, హారన్‌లు పెద్దగా మోగించడం.

| జలకాలుష్యం | వాయుకాలుష్యం | భూకాలుష్యం | అధికజనాభా | ట్రాఫిక్ సమస్యలు |
|---|---|---|---|---|
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |

**4) కింది పదాలనుండి ప్రకృతి, వికృతి పట్టిక తయారు చేయండి.**

(పట్టణం, రాతిరి, నిచ్చలు, సూర్యుడు, బాస, కథనం, పట్నం, రాత్రి, భాష, సూరీడు, కతనం, నిత్యం)

| ప్రకృతి | వికృతి |
|---|---|
| అ) ________ | ________ |
| ఆ) ________ | ________ |
| ఇ) ________ | ________ |
| ఈ) ________ | ________ |
| ఉ) ________ | ________ |

**పై ప్రకృతి, వికృతి పదాలు ఉపయోగించి వాక్యాలు రాయండి**

అ) ________

ఆ) ________

ఇ) ________

ఈ) ________

ఉ) ________

ఊ) ________

ఋ) ________

ౠ) ________

ఎ) ________

ఏ) ________

## V. సృజనాత్మకత



**కింది వాటిలో ఒక దానికి సమాధానం రాయండి.**

అ) పర్యావరణ పరిరక్షణ – కాలుష్య నివారణకై మీరు పాల్గొనే ర్యాలీకి అవసరమైన, మంచి సందేశం అందించే కొన్ని నినాదాలు రాయండి.

ఆ) మీరు నివసిస్తున్న/ మీకు దగ్గర్లో ఉన్న పట్టణంలో జనం ట్రాఫిక్ రూల్స్ సరిగ్గా పాటించడంలేదు. దీని గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఒక 'కరపత్రం' తయారు చేయండి.

## VI. ప్రశంస



### కింది వాటిలో ఒక దానికి సమాధానం రాయండి.

అ) మీ పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ గ్రూపు ఉంది. దీని ద్వారా కాలుష్యాన్ని నివారించడానికి పాఠశాల పక్షాన రకరకాల చర్యలు చేపడుతున్నారు. గ్రీన్ కోర్ గ్రూపును ప్రశంసిస్తూ మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

ఆ) వినాయకచవితి పండగను ఎంతో ఉత్సాహంగా జరుపు కొంటారు. అనేక గ్రామాలు, పట్టణాల్లో 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' తో చేసిన విగ్రహాలను వాడుతున్నారు. దీనికి బదులుగా మట్టి వినాయక విగ్రహాలు వాడాలని, తద్వారా నీటి కాలుష్యాన్ని నివారించడానికి ప్రజలను చైతన్యపరచమని కోరుతూ మట్టి వినాయకుల వాడేవారికి ప్రశంసలందిస్తూ పత్రికాధిపతికి/సంపాదకుడికి లేఖ రాయండి.

## VII. భాషాంశాలు



### 1. కింది వాటిని గమనించండి.

| సమాస పదం | విగ్రహవాక్యం |
|---|---|
| అ) సముద్రతీరం | సముద్రము "యొక్క" తీరం |
| ఆ) జలప్రవాహం | జలం "యొక్క" ప్రవాహం |
| ఇ) ప్రభుత్వ స్థలం | ప్రభుత్వం "యొక్క" స్థలం |
| ఈ) సూర్యకాంతి | సూర్యుని "యొక్క" కాంతి |
| ఉ) చర్మరోగాలు | చర్మాని "కి" రోగాలు |

పై విగ్రహ వాక్యాల్లో " " మధ్య ఉన్నవి విభక్తులేకదా? ఇవి షష్ఠీ విభక్తి ప్రత్యయాలు కదా !

మొదటి సమాస పదంలో 'సముద్రం' మొదటి పదం, 'తీరం' రెండవ పదం. కేవలం 'తీరం' అంటే దేని తీరమో తెలియదు కదా? 'సముద్రం' అన్నప్పుడు అది సముద్రతీరమని తెలుస్తుంది. అందుకే మొదటి (పూర్వ) పదం తర్వాత విభక్తి ప్రత్యయాన్ని వాడుతాం. పూర్వ, పర పదాల మధ్య విభక్తి ప్రత్యయాలను వాడినప్పుడు ఏర్పడే సమాసాలను తత్పురుష సమాసాలని అంటారు. షష్ఠీవిభక్తికి సంబంధించిన ప్రత్యయాలు వాడినప్పుడు 'షష్ఠీ తత్పురుష సమాసం' అని అంటారు.

పై సమాస పదాలన్నీ షష్ఠీ తత్పురుష సమాస పదాలే.



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**2. కిందివాటిని కలపండి, విడదీయండి, సంధిపేరు రాయండి.**



అ) మీరెవరు? = __________ + __________ __________

ఆ) __________ = పురుష + ఉత్తముడు __________

ఇ) వాడుగొట్టె = __________ + __________ __________

ఈ) విద్యాలయం = __________ + __________ __________

ఉ) __________ = ముత్యము + అంత __________



## ప్రాజెక్టు పని

1. ట్రాఫిక్ సమస్యలను నివారించే మార్గాలను తెలిపే బొమ్మలను గీయండి, నమూనాను తయారు చేయండి.
2. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తక్కువ ఖర్చుతో తయారయ్యే చెత్తకుండీలను తయారు చేయండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | ట్రాఫిక్ సమస్యల గూర్చి మాట్లాడగలను. చర్చల్లో పాల్గొనగలను. | ఔను / కాదు |
| 2. | పాఠ్యాంశాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3. | పర్యావరణ పరిరక్షణకు అవసరమైన నినాదాలు రాయగలను. | ఔను / కాదు |
| 4. | కాలుష్య నివారణ చర్యలను చేపట్టమని మిత్రునకు లేఖ రాయగలను. | ఔను / కాదు |


*సూక్తి: వృక్షోరక్షతి రక్షితః*

**చెట్లను మనం పెంచి కాపాడితే, అవి మనల్ని కాపాడుతాయి**

యూనిట్-III

# 9. తెలుగు నేల

- డా॥ సి. నారాయణ రెడ్డి



**ఆలోచించండి - మాట్లాడండి**

ప్రశ్నలు:

1. పై చిత్రంలో ఎవరెవరున్నారు?
2. వారి గొప్పదనం ఏమిటి?
3. మీకు తెలిసిన తెలుగు కవులు,రచయితల పేర్లు చెప్పండి.

**నేపథ్యం:** తెలుగునేల గొప్పదనాన్ని, తెలుగువారి గొప్పదనాన్ని, తెలుగుజాతి మేల్కొంటున్న విధానాన్ని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం. తెలుగునేల గేయాన్ని డా॥ సి.నారాయణరెడ్డి రాశారు.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠం చిత్రం గురించి మాట్లాడండి.
2. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
3. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
4. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టికను చూసి తెలుసుకోండి.



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



జాతిమేలుకొంటున్నది - తెలుగు
జాతి మేలుకొంటున్నది
జరిగిన వంచన తెలుసుకొని
కరిగిన కలలను తలచుకొని

జాతి మేలుకొంటున్నది - తెలుగు
జాతి మేలుకొంటున్నది
కలమును ఖడ్గముగా ఝుళిపించిన
కందుకూరి సంస్కరణ రణంలో -
వాడుకభాషను నిలబెట్టగ పో
రాడిన గిడుగు మహోద్యమ ధృతిలో -
ప్రజలభాషలో సజీవకవితలు
పలికించిన గురజాడ జాడలో -
రాష్ట్రస్తుతికై నాంది పలికిన
రాయప్రోలు రసార్ద్ర గీతిలో -
జాతి మేలుకొంటున్నది - తెలుగు
జాతి మేలుకొంటున్నది.

ఇదే ఇదే తెలుగునేల - నవకాంతులు
వెదజల్లే దీపమాల !
గోదావరీనదీ స్వాదు తరంగాలతో
కృష్ణవేణి కేలుకలిపి ఆడింది -
తుంభద్రాజల తరంగ రంగముపైన
మంజీర మహోదార మధుర గీతం పాడింది

ఇదే ఇదే తెలుగునేల - నవకాంతులు
వెదజల్లే దీపమాల !
ఏవేవో కలతలతో
ఏవో పీడకలలతో
చెదరిన మనజాతి పరువు
పదిలంగా కుదురుకుంది
తరతరాల తెలుగు వెలుగు
తెరలు దాటి పరచుకుంది
ఇదే ఇదే తెలుగునేల - నవకాంతులు
వెదజల్లే దీపమాల !

**కవిపరిచయం:**



1. కవిపేరు : డా॥ సి.నారాయణ రెడ్డి
2. జననం : 1931
3. జన్మస్థలం : గ్రా॥ హనుమాజీపేట; జి॥ కరీంనగర్
4. రచనలు : విశ్వంభర, నాగార్జునసాగరం, కర్పూర వసంతరాయలు, భూగోళమంత మనిషి, పరిణత వాణి వ్యాసాలు, ప్రపంచ పదులు, సినీ గీతాలు మొ॥వి.
5. పురస్కారాలు : పద్మశ్రీ, పద్మభూషణ్,జ్ఞానపీఠం.

**భావం:**

ఆంగ్లేయుల మోసం తెలుసుకొని, వారిని దేశం నుంచి వెళ్ళగొట్టి సాతంత్ర్యం సంపాదించుకొని భారతజాతి మేలుకొన్నది. తెలుగు జాతి అంతా మేలుకొన్నది. కందుకూరి వీరేశలింగం రచనలనే ఖడ్గంతో సమాజం సంస్కరింపబడింది. వాడుక భాషను నిలబెట్టడానికి, అమలు పరచడానికి గిడుగు రామమూర్తిగారి ఉద్యమం ఉపయోగపడింది.

గురజాడ అప్పారావు రచనలు ప్రజల జీవితాలలో వెలుగు నింపింది. రాష్ట్రస్తుతిని చేసిన రాయప్రోలు సుబ్బారావు రచనతో తెలుగుజాతి మేలుకొన్నది.

ఇదే ఇదే తెలుగునేల. కొత్త కాంతులను వెదజల్లే దీపమాల. పవిత్రమైన గోదావరీనది అలలతో కృష్ణవేణి నది చేయికలిపి ఆడింది. తుంగభద్రానది నీటి అలలనే వేదికపై మంజీరానది గొప్పధారతో కూడిన మధుర గీతం పాడింది. ఇదే తెలుగునేల. కొత్త కాంతులను వెదజల్లే దీపమాల. ఆంగ్లేయుల బాధల కలతలతో, ఏవోపీడకలలతో చెదిరిపోయిన మన తెలుగు జాతి పరువు పదిలంగా ఉంది. తరతరాల తెలుగు వెలుగు తెరలు దాటిపోయి పరచుకుంది. ఇదే తెలుగునేల – నవకాంతులు వెదజల్లే దీపమాల.

**విశేషాంశాలు**

1. **గిడుగు రామమూర్తి పంతులు :** జననం:29-8-1863. వ్యావహారిక భాషోద్యమానికి, సవర భాషావ్యాప్తికి అలుపెరగని కృషిచేశారు. వీరు బహుభాషావేత్త. ఈయన జయంతి ఆగస్ట్ 29నాడు "తెలుగు భాషా దినోత్సవం" జరుపుకుంటారు.
2. **కందుకూరి వీరేశలింగం :** 16-4-1848లో రాజమండ్రిలో జన్మించారు. సంఘసంస్కర్త. సామాజిక దురాచారాల నిర్మూలనకు శ్రమించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు.
3. **గురజాడ అప్పారావు :** 19-20 శతాబ్దంలో వీరు జీవించారు. సంఘసంస్కర్త. బాల్యవివాహాలు రూపుమాపడానికి కలంతో పోరాడినారు. వీరి 'కన్యాశుల్కం' అనే నాటకం (1890) అప్పటి వాడుక భాషలో రాయబడింది.
4. **రాయప్రోలు సుబ్బారావు :** (1892 – 1984)
కవి, అనువాదకులు, స్వాతంత్ర్య సమరయోధులు. జాతీయోద్యమంలో వీరి రచనలు ఎంతో ప్రేరణనిచ్చాయి. గుంటూరు జిల్లా బాపట్ల వాస్తవ్యులు.


తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. ఈ గేయంలో చెప్పిన విషయమేమిటి?
2. మీకు తెలిసిన సంఘసంస్కర్తల గురించి చెప్పండి.
3. మన రాష్ట్రంలో ప్రవహించే నదుల గురించి చెప్పండి.
4. స్వాతంత్ర్యోద్యమం గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. పాఠంలోని కింది భావాలు గల పాదాలు వెదికి రాయండి.

   అ) జరిగిన మోసం తెలుసుకొని

   ఆ) కొత్తకాంతులను విరజిమ్ముతున్న తెలుగు భూమి

2. గేయాన్ని చదవండి. పది ప్రశ్నలు తయారు చేయండి.
3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

   అ) తెలుగుజాతి మేలుకొన్న విధానాన్ని వివరించండి.

   ఆ) తెలుగు నేలపై ప్రవహించే ఏయే నదుల గురించి పాఠంలో పేర్కొన్నారు?

   ఇ) తెరలు దాటి పరచుకున్నది ఏది?

### III. స్వీయరచన



కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) సంఘ సంస్కర్తలని ఎవరినంటారు? వారు చేసే పనుల వల్ల కలిగే ప్రయోజనాలను సొంతమాటల్లో రాయండి.

ఆ) పాఠ్యభాగ సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

## IV. పదజాలం



1. కింది వాక్యాలలోని గీత గీసిన పదాలకు అదే అర్థాన్నిచ్చే మరో రెండు పదాలు రాయండి.

అ) కందుకూరి కలము ఖడ్గంగా వెలిసింది. ________ ________

ఆ) జాతీయ మహోద్యమంలో ధృతిగా పాల్గొన్నారు. ________ ________

ఇ) సముద్ర తరంగాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ________ ________

ఈ) తుంగభద్రానదీ జలం అందరినీ పావనం చేస్తుంది. ________ ________

2 కింది వాక్యాలలో గీతగీసిన పదాలనుండి ప్రకృతి – వికృతి పదాలను రాయండి.

అ) అన్ని భాషలలో తెలుగు బాస కూడా గొప్పది.

ఆ) రాయప్రోలు కవితలు మనల మేలుకొల్పేకైత కిరణాలు.

ఇ) స్త్రీ ఇంటికి దీపం. ఆ దివ్వె దేశానికి శక్తి.

| | ప్రకృతి | వికృతి |
|---|---|---|
| i) | ______ | ______ |
| ii) | ______ | ______ |
| iii) | ______ | ______ |

3 కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు వ్యతిరేకార్థక పదాలతో వాక్యాలు రాయండి.

అ) ఆంగ్లేయులు వంచనతో మనదేశాన్ని పాలించారు.

ఆ) జాతి మేలుకొంటున్నది.

ఇ) గురజాడ కవితలు సజీవంగా సమాజంలో ఉన్నాయి.

ఈ) ప్రజ్ఞ మధుర గీతం పాడింది.

## V. సృజనాత్మకత



ఒక సంఘసంస్కర్త వేషధారణతో వారి సందేశాన్ని ప్రచారం చేస్తున్నట్లు ఏకపాత్రాభినయం చేయండి.

## VI. ప్రశంస



మీ గ్రామంలో / నగరంలో ఉండే దురాచారాలను తొలగించే వ్యక్తుల గురించి తెలుసుకొని వారిని ప్రశంసిస్తూ నీ మిత్రుడికి లేఖ రాయండి.

## VII. భాషాంశాలు



### 1. కింది పదాలను విడదీయండి.


ఉదా॥ మాయమ్మ = మా + అమ్మ = మాయమ్మ

మీయిల్లు = .... + ..... = .........

హరియితడు = .... + ..... = .........

పై సందర్భాల్లో సంధి జరగలేదు. కాని, కొత్తగా 'య్' వచ్చి చేరింది. అట్లా చేరడంవల్ల

ఈ కింది విధంగా మార్పు జరిగింది.



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| అ) | మా | + | య్ | + | అమ్మ | = | మా 'య' మ్మ |
| ఆ) | మీ | + | య్ | + | ఇల్లు | = | మీ 'యి' ల్లు |
| ఇ) | హరి | + | య్ | + | ఇతడు | = | హరి 'యి' తడు |

ఇలా సంధిలేని చోట 'య్' వచ్చి చేరడాన్నే **"యడాగమం"** అంటారు.

కింది పదాలను కలిపి జరిగిన మార్పును సరిచూచుకోండి.

ఉదా॥ అని + అడిగిన = (య్ + అ = య) = అని యడిగిన

అ) మా + ఊరు = .................. + ..................

ఆ) సరి + అని = .................. + ..................

అ) జరగని + అపుడు = .................. + ..................

అ) చేసి + ఉంటే = .................. + ..................

### 2. కింది వాక్యాలను గమనించండి. విభక్తులను గుర్తించి రాయండి.

అ) భారత్ ఆరు వికెట్లతో కప్ గెలిచింది. ..................

ఆ) సమాజంలో అవసరమున్నవాళ్ళకు సేవచేయడమే సమాజసేవ ..................

ఇ) అనారోగ్యంవల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ..................

ఈ) లంక సింహాలు తోకముడిచాయి. ..................

ఉ) సచిన్ గురించి నీకు తెలిసిన విషయాలు ఏమిటి. ..................

పై వాక్యాల్లో గీతగీసిన అక్షరాన్ని లేదా పదాన్ని తొలగించి చదవండి.

**3. కింది వాక్యాలను "కర్తరి", "కర్మణి" వాక్యాలుగా మార్చండి.**

అ) సునీల్ రైలును నడిపాడు.

ఆ) మామిడి పండ్లు మామయ్యచే తేబడెను.

ఇ) విద్యార్థులు ప్రార్థన చేస్తున్నారు.

ఈ) పాఠశాల మనందరిచే శుభ్రము చేయబడెను.

ఉ) భీముడు కొండలను పిండి జేసెను.

ఊ) పిల్లలు కౌసర్‌చే క్రమశిక్షణలో ఉంచబడ్డారు.



## ప్రాజెక్టు పని

**హిందీ, ఉర్దూ మొదలగు భాషలకు సేవ చేసిన గొప్పవారి చిత్రాలు, వారి సేవలను వివరిస్తూ ఒక ఆల్బమ్ తయారు చేసి ప్రదర్శించండి.**



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 3. | సంఘసంస్కర్తల గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 4. | గేయాన్ని చదివి ప్రశ్నలు రాయగలను. | ఔను / కాదు |

"మూర్ఖుడి హృదయం నోటిలో ఉంటుంది.
బుద్ధిమంతుడి నోరు హృదయంలో ఉంటుంది"



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

యూనిట్-III

# తెలుగు వెలుగులు

చదువు-ఆనందించు

దేశదేశములందు భారతము వెలుగు
దేశభాషలలోన మా తెలుగు వెలుగు
తెలుగు నందలి కావ్యములు వెలుగు తేట
కావ్యాలు మా తెలుగు కడపలను వెలుగు

నన్నయ్య భారతమునందు చింతామణులు
అన్నయ్య సంకీర్తనముల మాధురులు
చిన్నయ్య కథలలో నీతిచంద్రికలు
ఎన్ని యుగములకైన మిన్నగా వెలుగు ॥దేశ॥

తిక్కన్న భారతము చిప్పిలు రసాలు
జక్కన్న కావ్యాన చెలగు నానుడులు
ముక్కన్న పారిజాతపు సౌరభాలు
చుక్క లున్నంతకు నిక్కముగ వెలుగు ॥దేశ॥

భీమన్న కవితా విషామృతాస్త్రాలు
సోమన్న భాషఛందో విప్లవాలు
వేమన్న పలికిన ఆటవెలదులు
మేమున్న మా తెలుగు గడ్డకే వెలుగు ॥దేశ॥

ప్రెగ్గడారణ్యపర్వాన శేషోన్నయం
దుగ్గన్న నేర్పు చాటిన ఉపాఖ్యానం
జగ్గన్న కవి నిరంకుశుడన్న ధ్యేయం
నిగ్గుదేరిన కావ్యకళలకే వెలుగు ॥దేశ॥

మారన్న తను పురాణించు మార్గమ్ము
వీరన్న వాణి శృంగార పూరమ్ము
సూరన్నకృత-కళాపూర్ణోదయమ్ము
సూరి జనులు మెచ్చ శక్రుడై వెలుగు ॥దేశ॥

రేచన్న యిచ్చిన కవి గజాంకుశము
నాచన్న కవితా నవీన గుణ యశము
బేచన్న కవితా నిగూఢమగు రసము
ఊచబోవని చెఱకు కోలలై వెలుగు ॥దేశ॥

కేతన్న ఆంధ్రభాషాభూషణాలు
పోతన్న రచనలో పాలమీగడలు
తాతన్న చూపిన కవిత లక్ష్యాలు
జాతికే గర్వమై చేతములు వెలుగు ॥దేశ॥

బద్దెన్న సుమతి లౌకిక ముక్తకాలు
బుద్ధన్న ద్విపదలో చక్కందనాలు
పెద్దన్న జిగిబిగి చెదని అల్లికలు
ముద్దులగు రత్నాల మూటలై వెలుగు

దేశదేశములందు భారతము వెలుగు
దేశభాషలలోన మన తెలుగు వెలుగు


– కపిలవాయి లింగమూర్తి

*సూచన: గేయంలో ఉన్న పేర్లన్నీ తెలుగు కవులవి.*

యూనిట్-IV

# 10. నేను... చిందుల ఎల్లమ్మను

**ఆలోచించండి - మాట్లాడండి**



**ప్రశ్నలు:**


1. చిత్రంలోప్రదర్శిస్తున్న కళ పేరు ఏమిటి ?
2. వాటిని ఎలా ప్రదర్శిస్తారు ?
3. మీరెప్పుడైనా చూశారా ?
4. మీకు తెలిసిన కళాకారుల గురించి చెప్పండి.

**ఉద్దేశం:** ప్రపంచీకరణ ప్రభావం, సినిమా, టీవీల వల్ల గ్రామీణ సాంస్కృతిక వాతావరణంలో అనేక మార్పులు వచ్చాయి. సామాన్యుడి వినోదం, జానపద కళల రూపురేఖలు మారిపోయాయి. అనేక ప్రజాకళలు అంతరించిపోతున్నాయి. అలా అంతరించి పోతున్న కళలను బతికించి, ఆ కళాకారులను గౌరవించే సంప్రదాయాన్ని ప్రోత్సహించడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

**ప్రస్తుత పాఠ్యభాగం "నేను చిందుల ఎల్లమ్మను...." అనే పుస్తకంలోది.**

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న "పదాలు - అర్థాలు" పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



నేను చిందుల ఎల్లమ్మను. మేం పులింటోళ్లం. మాది కుద్దు చిన్నాపురం. నిజామాబాదు కెల్లి ఆరమూరుకుపోయే దారిల మామిడి పల్లి ఉన్నది గదా.... ఆ మామిడిపల్లి పక్కదే చిన్నాపురం. అది మా తాతలది.... మా సంతం ఊరు.

మాసిందోల్లకు పూర్వం ఇనాము లేమి లేకుండె.. సిందాట ఆడుకొని బతుకుడెవుండె. 'ఆశెరువు కట్ట సురయితన్నపుడు పుట్టినవు బిడ్డా' అన్నడు ఒకనాడు మానాయన. అది యాదికి ఉన్నది. దాన్ని నిజాంసాగరు అంటుంన్రు. అప్పుడు నిజాం బాషా ఉండెగదా. నా చిన్నప్పుడు పలకలు లేకుండె. మాకు పలకలు దొరకక పోయె. ఎక్క అయ్యవారు అని ఒకాయన సదువు జెపుతుండె. అక్షరాలు పెట్టిచ్చినందుకు మేం ఆయనకు ఏమీ ఇయ్యక పోతుంటిమి. మా దగ్గర ఏముండె?

మా చిన్నాపురంల స్కూలు లేకుండె. అప్పుడు మాకు పలకల దొరకక పోయె. ఆడాడ పలిగిపోయిన కాగులు వుంటుండె గద. గొంచెం సక్కగున్న బోకె పెంకలు ఆటిలకెల్లి ఏరుక వచ్చుకుంటుంటిమి. వాటిని సక్కగ చేసుకుంటుంటిమి. బొగ్గుతో రాస్తుంటిమి. తర్వాత ఎప్పుడో గదా బలపాలు వచ్చినయి. ఇగ ఈ ఊర్లుంటే ఈన్నే. ఆఊర్లుంటే ఆన్నే. ఇస్కూలు గనక లేకపోతే ఇంట్ల మాపెద్దోల్లే సదువు చెపుతుంన్రి. ఇప్పటికీ మా పిల్లగాల్లను ఊర్లసదువుకున్నదాక సదివిస్తం. మల్లా ఇంకో ఊరికి పోతున్నప్పుడు సర్టిఫికెటు తీసుకొని ఆ ఊర్ల చేరిపిస్తం. మాదగ్గర పెద్దబాలశిక్ష పుస్తకం ఉంటది. ఎప్పుడూ దాన్నే సదివేటోల్లం అప్పుడు... అదే మాసదువు!

నేను మరీ చిన్నగుండంగ ఊరికి రెండు, మూడు భాగోతాలే ఆడుతుంన్రి మావోల్లు. మావోల్లకు అప్పుడు ఆటలు రాకపోవు బాగ. ఎల్లమ్మాట ఒకటి. చెంచులక్ష్మి ఒకటి. సారంగధర ఒకటి. ఈ మూడే ఆడుతుంన్రి ఎక్కువ. అప్పుడు తీనానకు (తీన్ అణాలు అంటే 18 పైసలకు) మానెడువడ్లు అస్తుండె. నేను కష్టపడ్డనాయినా! మాకు అప్పుడు భూముల్లేకుండే ఏమీ లేకుండె. ఆడకొన్నిరోజులు బతికి, పెండ్లిల్లు చేసుకొని అస్తుంటే రాంగ రాంగ కనకాపురంల మాఅన్న గంగారం పుట్టిండట. నేనేమో బాసర (సరస్వతీక్షేత్రం)ల పుట్టిన్నట.

నేను బాసరల పుట్టినగదా, అందుకే మానాయన నాకు సరస్వతి అనిపేరు పెట్టిండు. అస్సలు నా మొదటి పేరు సరస్వతే గాని తర్వాత ఎల్లమ్మ తల్లి తన పేరు పెట్టుకున్నది. అందరికి సిన్నప్పటినుంచే భాగోతం నేర్పుతుండ్రి పెద్దోల్లు నాకు నాలుగేండ్లు ఉండంగ నా మొఖంకు రంగు ఏసిండ్రు. బాలక్రిష్ణ యేషం కట్టిపిచ్చిన్రు. మావోల్లు ఎనుక పాట పాడితే నేను తెరముందు ఎగురవడితి. మా తల్లిదండ్రులు యేషం ఏయించి తోలిస్తుండ్రి (తెరముందుకు) నా చేయి పట్టుకపోయి. 'ఇగ ఎగురు' అంటుండ్రి. అట్లు భాగోతం ఆడుడు అలవాటు జేసిండ్రు. నాకు ఎనిమిది ఏండ్లప్పుడు అందుకున్న ఇగ బాలక్రిష్ణయేషం. తర్వాత రంభ యేషం గడుతుంటి.

ఇగ అట్లనే ఆడుకుంట పెద్దపెరిగితి. అట్ల పదకొండు ఏండ్లు అచ్చేదాక రంభయేషం గట్టిన. ఆడికెల్లి ఇగ పెద్దయేషం ఇస్తుండ్రి. అక్కయేషం అన్నా. అత్తయేషం అన్నా, సవతి యేషం అన్నా ఇస్తుండ్రి. చెంచుభాగోతం ఏస్తే లక్ష్మి యేషం కడుతుంటి. సారంగధరలో రత్నాంగి యేషం కడుతుంటి. ధర్మాంగదలో ధర్మావతి. మేం మాచిన్న పిల్లలకు తబలా కొట్టుకుంట, పాటపాడుకుంట ఆడుడు నేరిపిస్తం. ఒక ఊర్లఆడి ఇంకో ఊరికిపోయేటపుడు ఏడ వీలుంటే ఆడ పిల్లలకు చెబుతనె ఉంటం. అంబకీర్తన సాగిపిచ్చిన మంటే అయిపాయె. అప్పటి సందే ఆడిపిస్తం ఇగ.

రంభయేషం వచ్చినంక గోపాల క్రిష్ణునియేషం అస్తది గదా భాగోతంల. "రంభా ఊర్వశులమమ్మామాయమ్మా" అని పాడుకుంట పిల్లల్ని పర్ద (తెర) ముందు ఆడిపిస్తే అది అంబకీర్తన అన్నట్లు. ప్రారంభం...! అంబకీర్తన అంటే ప్రార్థననే...!

సిన్ని క్రిష్ణుడనురా– బలు వన్నెలు దెలిపెదరా

చెన్ను మీరగ – గొల్లభామల చెంత జేరెదనురా.... అని పిల్లలతో పాడిపించి, భాగోతం మొదలు పెడతం....తెరవెనుక యేషాలు తయారయిన దనుక ఇదే. అటు పిల్లలకు నేర్పిచ్చినట్లవుతది. ఇటు యేషాలు తయారైనట్టు అయితది. అసలు భాగోతం మొదలు పెట్టేటపుడు ముందుగాల గణపతి ప్రార్థన. సరస్వతి ప్రార్థన చేస్తం. పందిరి కింద. ఇది పదిన్నర పదకొండు అప్పుడు అనుకో..... పన్నెండు ఒంటిగంటప్పుడు భాగోతం మొదలవుతది.

ఇగ కథల భావం, సారం తీస్కుంటం. చిన్నప్పటి నుంచే ఇవన్నీ మాకు రూఢీ అవుతాయి. భయ ముండదు ఇగ. "సిందుభాగోత" మంటే ఇంతేగదా అనిపిస్తుంది. ఇట్లానేను ఒక్కొక్కటి రూఢి చేసుకుంటవోయిన. ఎట్లంటే నువ్వు గూసింటివి. 'పాడు' అంటివి. నేను పాడుతుంటి. యెనక మానాయనగానీ, తాతగాని వుంటుండ్రి. ఆల్లొకటి అందుకుంటుండ్రి. నేనొకటి అందుకుంటుంటి. అస్సలు ఆసిన్నప్పటి నుండి అదే లోకంల ఉంటుంటి. ఇప్పటికీ అంతే!

కొత్తది ఏదన్న ఇన్పించెంటే ఆపాటనే ఊకె (నిరంతరం) నోట్లె తిరుగుతది. అట్ల మనసుల తిప్పుకుంటుంటి. అప్పుడు లావు ధ్యానం ఉండు. అవ్వీ ఇవ్వీ ఏమీ లేకుంటుండె. నాకు కీర్తి రావాల. మా తల్లిదండ్రికి పేరు దేవాల. రాజ్యం మీద పేరు నిలుపాల..... అనే ఉంటుండె. నాకు, మాయన్న గంగారాంకు అస్సలు భాగోతం నేరిపిందిమాతాత. అంటె తండ్రితండ్రి. ఆయనే గురువు మాకు. మంచిగా పాడుతుండె. అభినయంలో అట్లనే!

ఇగ నేను పెద్దగ అవుతున్ననంటే మేటియేషాలకు అందిన. బభ్రువాహనలో చిత్రాంగద. సుందరకాండలో సీత, సతీ సావిత్రిలో సావిత్రి యేషాలు ఎయ్యవడితి. అట్లనే మొగ యేషాలు అందుకుంటి. రాజునైతి. మొట్టమొదట వాలి, ధర్మాంగదుడు, రుక్మాంగమారాజు, మాంధాత, నారాయణమూర్తి (విప్రనారాయణ) కుశలుడి యేషం (కుశలవో పాఖ్యానం) హనుమంతుడు (హనుమంత భేటి) చిరు తొండ మారాజు ఇట్ల ఒకటిగాకుండ ఒకటి నేర్పవట్టిన... నేర్పవట్టిన్రు మావొళ్లు.



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ఈ చుట్టుపట్టువూర్లల్ల భాగోతాలు ఆడుతుంటిమి. అట్లనే బాన్సువాడ, మద్నూరు (నిజామాబాదు జిల్లా) దేగ్లూరు (మహారాష్ట్ర) దాకా పోతుంటిమి. అక్కన్నుండి షాపురం, సైనిపురం, అద్దంపురం మీదికెల్లి నర్సాపురం రోడ్డుకు (మెదకు జిల్లా) తిరుగుతుంటిమి. ఇట్లా ఎప్పుడంటే అప్పుడే తిరుగుతుంటిమి, భాగోతాలు ఆడుతుంటిమి. యాడ వానాకాలం వస్తే ఆన్నే ఉంటుంటిమి.

మాభాగోతంల తెరవెనక పల్లవి ఉండాలె. అది పెద్దల సందీ ఉన్నది. దాన్ని వెనక పల్లవి అంటం. అదిలేకపోతే పాట, ఆట రుచిరాదు. తైతకధోం తకధోం. అని వెనకపల్లవి పాడేటోల్లు అన్నదాకా తెరముందాడే మా యేషాలకు కాలు లెవ్వనే లెవ్వదు. ఒక పాట, దరువు అయిపోయినట్లయిది. ఆ వెనక పల్లవితో, కందం ఒక రకమైన పద్యం. అట్లనే కందార్థం గిట్లుంటది.......

అవని మీద అమ్మా ........ నీకేల చింత

కన్నతల్లులు మీకది సమ్మతంబా

....... ........... మాతల్లి వినుమా .......

ధనము పాయెను - దండి రాజ్యంబు పాయె

ఘనమైనగోవులు - క్షణములో పాయె

అంతయిన ఆరుగురు తండ్రులు - ఇంతలో పోయిరి.

ఏమిసేతు .... వంతు కచ్చెను - వనముపాలై రంత

సింతజేయకె తల్లి - శ్రీహరీ కరుణా ... అమ్మా....

అమ్మా సుభద్రా నామీద - అలగీనవేమో కానీ

అమ్మాయని పిలువంగ - రానే రాదేమోగానీ

మేటి దొరలంతా లేరని - మాటామాటాకు నేమి

మాటి మాటీకి ఏడ్వ - ఏంటికీ లేవమ్మా

దండి అర్జునపిండ - మెండు మాటేమో జెపగి

పాండూ కోడలా లెవ్వ - అమ్మా .... పాండుకోడలా లెవ్వ....

మేం పాడుతుంటె వెనుక పల్లవి అందుకుంటరిగ మావోల్లు... ఇగ అస్సలు సంగతి బుడ్డర్‌ఖాన్ యేషం. ఆ యేషం సూసెటోళ్లను కడుపుబ్బ నగిపిస్తది. అదిలేకుంటే మా బాగోతంకు నిండుదనమే లేదు. ఇట్ల నేను ఇరవైఐదు బాగోతాలల్ల మేటియేషాలు యేస్తుంటి. అవసరమయితే మగయేషాలు గడుతుంటి. వాటి మాటలు, పాటలన్నీ ఎప్పటికి రూఢిగా ఉంటయి. మరచిపోకడ లేదు. మల్ల మల్ల సూసుడు లేదు. సదువుడు లేదు.. దీనికి ఇది దీనికి ఇది..... అని మనసుల వుంటది. ఈ విధంగా పాడితే ఈ విధంగా అనాల అని మనసుకు పడతది.... ఇగ ఇట్లనే చెప్పుకుంటపోతం.... బతుకంతా.....

**రచయిత పరిచయం:**

డా॥ కె.ముత్యం, అంతరించి పోతున్న కళారూపాల్ని అధ్యయనం చేస్తూ, జానపద కళాకారుల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులపై పరిశోధనలో భాగంగా చిందు ఎల్లమ్మతో కొన్ని రోజులపాటు మాట్లాడారు. ఆ విశేషాలన్నింటిని రికార్డ్ చేశారు. వాటినే "నేను చిందుల ఎల్లమ్మను" అనే పేరుతో చిందు భాగవతం అనే ఉపశీర్షికతో కూర్పుచేసి సంపాదకుడిగా వ్యవహరించారు.

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. "చిందుల ఎల్లమ్మ" గురించి తెల్సుకున్నారు కదా? ఆమెలోని గొప్పతనం ఏమిటి?
2. మీ గ్రామంలో ఊరిలోని కళాకారుల గురించి లేదా ఇతర కళాకారుల గురించి చెప్పండి.
3. గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులు ప్రస్తుతం ఎందుకు ఎక్కువగా కన్పించడం లేదు?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. కింది పదాలను, వాటి వ్యవహార రూపాలనూ చదవండి.

ఉదా॥ సంతం – సొంత

అ) సిందోల్లకు – చిందులాల్లకు / చిందులవారికి

ఆ) యాదికి – జ్ఞప్తికి / గుర్తుకు

ఇ) అంటుంద్రి – అంటుండిరి / అంటుండేవారు

2. ఇలాంటి మరిన్ని పదాలను పాఠం నుంచి వెతికి వాటి వ్యావహారిక రూపాలను రాయండి.

అ) ________ – ________________ ఆ) ________ – ________________

ఇ) ________ – ________________ ఈ) ________ – ________________

ఉ) ________ – ________________ ఊ) ________ – ________________



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

3. **పాఠంలోని రెండు, మూడు పేరాలు చదవండి. వాటికి తగిన శీర్షిక పెట్టండి.**

4. **పాఠం ఆధారంగా కింది పాటను సరిగా రాయండి.**

అవనిమీద అమ్మా ..... నీకేలచింత

మీకిది సమ్మతంబా కన్నతల్లులు

............... మాతల్లి వినుమా

ధనమువాయె – దండిరాజ్యంబు పాయెను

క్షణములోవాయె – ఘనమైనగోవులు

________________________

________________________

________________________

5. **పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

అ) చిందుల ఎల్లమ్మ చదువు చెప్పిన అయ్యవారికి ఏమి ఇచ్చేది?

ఆ) చిందుల ఎల్లమ్మ అసలుపేరు ఏమిటి? ఆమెకు ఆపేరు ఎందుకు పెట్టారు?

ఇ) ఎల్లమ్మకు భాగోతం ఎవరు నేర్పారు? ఎందుకు నేర్చుకోవాలనుకుంది.

ఈ) ఎల్లమ్మ ఏయే ఊర్లలో బాగోతాలు వేశారు?

## III. స్వీయరచన



1) **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) చిందుల ఎల్లమ్మ చిన్నతనంలో చూసిన భాగోతాల గురించి మీకేమి అర్థమైంది?

ఆ) చిందుల ఎల్లమ్మ బాల్యంలో కట్టిన వేషాల వల్ల మీకు తెల్సినదేమి?

ఇ) ఎల్లమ్మ పెద్దయిన తరువాత వేసిన యేషాలు వివరించండి?

ఈ) చిందు భాగోతాలు ఇప్పుడు ఆడుతున్నారా? లేదా? ఎందుకు?

ఉ) చిందు భాగోతానికి నిండుదనం ఎలా వస్తుందని మీరు అనుకుంటున్నారు?

2) **కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ) ఈ పాఠంలో చిందుల ఎల్లమ్మ చెప్పిన ముచ్చట్లను మీ సొంత మాటల్లో రాయండి.

ఆ) చిందు భాగోతాన్ని ఎలా ఆడుతారో వర్ణించండి?

ఇ) పాఠం ఆధారంగా చిందు భాగోతాన్ని కళాకారులు ఎలా నేర్చుకుంటారో వివరించండి.

## IV. పదజాలం



1. **సరైన అర్థాన్ని గుర్తించండి.**

అ) ఇనాం ( )

ఎ) పొలం బి) వారసత్వపు ఆస్తి

సి) బంగారం డి) బహుమతిగా వచ్చిన భూమి

ఆ) కీర్తన ( )

ఎ) పాట బి) వచనకవిత సి) నవల డి) కథ

ఇ) రూఢి ( )

ఎ) నిజం బి) రూక సి) నిర్ధారణ డి) మార్గం

ఈ) ధ్యానం ( )

ఎ) భక్తి బి) ఏకాగ్రత, లగ్నం సి) ప్రార్థన డి) యోగం

2. **కింది పదాలకు సొంతవాక్యాలు రాయండి.**

ఉదా॥ అలవాటు : ఉదయాన్నే నిద్రలేవగానే వ్యాయామం చేయడం నా <u>అలవాటు.</u>


అ) అభినయం : ____________________

ఆ) నిండుదనం: ____________________

ఇ) తెరవెనుక : ____________________

ఈ) కడుపుబ్బ : ____________________

3. **కింది వాక్యాలకు వ్యతిరేక భావం వచ్చేలా వాక్యాన్ని తిరిగి రాయండి.**



అ) మేం సంతకు వెళ్ళాం.

____________________

ఆ) పాటలు చక్కగా పాడకుంటే శ్రోతలకు విసుగువస్తుంది.

____________________

ఇ) చుట్టుపక్కల ఊర్లల్లో భాగవతాలు ఆడేవారు కాదు.

____________________

ఈ) హాస్యం వల్ల భాగోతానికి నిండుదనం రాదు.

____________________



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## V. సృజనాత్మకత



**కింది వానిలో ఒక దానికి సమాధానం రాయండి.**

అ) చిందుల ఎల్లమ్మను గురించి వివరిస్తూ మిత్రుడికి లేఖ రాయండి.

ఆ) నీకు నచ్చిన ఏదైనా ఒక కళను మీ పాఠశాల కార్యక్రమాలలో ప్రదర్శించండి.

## VI. ప్రశంస



**పాఠం మాండలిక భాషలో ఉన్నది. పాఠంలోని మొదటి పేరాను సొంతమాటల్లో రాయండి.**

## VII. భాషాంశాలు



**1. కింది పదాలను విడదీయండి. అవి ఏ సంధులో గుర్తించండి.**

అ) చింతాకు = ................ + ................

ఆ) ఇంకొకరు = ................ + ................

ఇ) వంటాముదం = ................ + ................

ఈ) ఈయనెవరు = ................ + ................

**2. కింది మాటలను కలపండి. అవి అత్వసంధి పదాలేనా? చర్చించండి.**

అ) నాయన + అమ్మ = ................ + ................

ఆ) పట్టిన + అంత = ................ + ................

ఇ) చేసిన + అంత = ................ + ................

ఈ) లేక + ఉన్న = ................ + ................

**3. కింది పదాలను విడదీయండి. సంధి పేరు రాయండి.**

అ) చేతికందిన = ................ + ................ (        )

ఆ) అదెట్లు = ................ + ................ (        )

ఇ) లేనిదంటూ = ................ + ................ (        )

ఈ) పదింతలు = ................ + ................ (        )

4. కింది మాటలను కలపండి. అవి ఇత్వసంధి పదాలు అవునో కాదో ఆలోచించండి.

అ) మరి + ఒక = ..............................

ఆ) ఏది + ఐనా = ..............................

ఇ) ఏమి + అంటివి = ..............................

ఈ) లేని + అప్పుడు = ..............................

5. కింది పదాలను విడదీయండి. సంధి ఏదో గుర్తించండి.

అ) లెమ్మని = ............... + ............... (  )

ఆ) అందొకటి = ............... + ............... (  )

ఇ) నెపమెన్నక = ............... + ............... (  )

ఈ) వేరొకడు = ............... + ............... (  )

6. కింది మాటలను కలపండి. అవి ఉత్వసంధి పదాలేనా? నిర్ణయించండి.

అ) అతడు + అట్లు = ..............................

ఆ) వనము + ఎల్ల = ..............................

ఇ) మనము + ఇప్పుడు = ..............................

ఈ) మేలు + అవి = ..............................

7. కింది పదాలను విడదీయండి. యడాగమం వచ్చిందని గ్రహించండి.

అ) ఏలియున్న = ............... + ...............

ఆ) భార్యయేల = ............... + ...............

ఇ) కోసియిచ్చి = ............... + ...............

ఈ) పాడియావు = ............... + ...............

8. కింది మాటలను కలపండి. సంధి పేరు రాయండి.

అ) మంచి + అదను = ..............................

ఆ) మరి + ఒక్కడు = ..............................

ఇ) పది + ఆరువేల = ..............................

## ప్రాజెక్టు పని

చిందు భాగోతం అనే కళను తెలుసుకున్నారు కదా! మీ ప్రాంతంలో ఏ కళలు ఉన్నాయి. వాటి పేర్లు, కళాకారుల వివరాలను ఒక పట్టికలో ప్రదర్శించండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | నేను 'చిందుల ఎల్లమ్మను' గురించి సొంతమాటల్లో చెప్పగలను. కళాకారుల గురించి చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠ్యాంశాన్ని ధారాళంగా చదవగలను. పేరాలకు శీర్షికలు పెట్టగలను. | ఔను / కాదు |
| 3. | పాఠ్యాంశంలోని ప్రశ్నలకు జవాబులు సొంతంగా రాయగలను. | ఔను / కాదు |
| 4. | ఇందులోని పదాలను సొంత వాక్యాలలో ప్రయోగించగలను. | ఔను / కాదు |
| 5. | మాండలిక పదాలకు అర్థాలు చెప్పగలను. ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 6. | కళాకారుల గురించి వివరిస్తూ లేఖరాయగలను | ఔను / కాదు |

"గొప్పతనానికి ముందు వినయముంటుంది
పతనానికి వెనక గర్వముంటుంది"

# యూనిట్-IV

# 11. గాలిబ్ గీతాలు

మూలం: మీర్జా అసదుల్లాఖాన్ (గాలిబ్)

అనువాదం : డా॥ దాశరథి కృష్ణమాచార్యులు

## చదవండి - ఆలోచించండి - మాట్లాడండి

1. 'కడివెడు కబుర్లకన్నా, గంటెడు, ఆచరణమేలు'
2. 'ఆత్మస్తుతి, పరనింద పనికిరాదు'
3. 'తన కోపమె తన శత్రువు'
4. 'వినయాన్నివ్వని విద్య వ్యర్థం'

**ప్రశ్నలు:**

1. పై వాక్యాలను ఏమంటారు?
2. ఈ వాక్యాల ద్వారా మీరేమి గ్రహించారు?
3. మంచి సందేశాలనిచ్చే విషయాలు ఏఏ రూపాల్లో ఉంటాయి?
4. వీటివల్ల ఉపయోగమేమిటి?
5. ఇలాంటివి ఇతర భాషల్లో కూడా ఉన్నాయా?

**ఉద్దేశం:** అన్ని భాషల్లోనూ విలువలు, వైఖరులకు సంబంధించిన సాహిత్యం ఉందా. ఉర్దూభాషలోని గజళ్ళను దాశరథి గారు తెలుగులోకి అనువాదం చేశారు. వీటిద్వారా పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం కోసం ఉద్దేశించినది ఈ పాఠం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠం చిత్రం ఆధారంగా భావాన్ని ఊహించి చెప్పండి.
2. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాల కింద, వాక్యాల కింద గీతలు గీయండి.
3. తెలియని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
4. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'పదాలు - అర్థాలు' పట్టికలో తెలియని పదాల అర్థాలను చూసి తెలుసుకోండి.

1. ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు నరుడౌట యెంతొ దుష్కరము సుమ్ము

2. స్వీయలోపమ్ము లెరుగుట పెద్ద విద్య
లోప మెరిగిన వాడె పూర్ణుడగు నరుడు

3. సహృదయమునకు బయట సన్మాన మబ్బును
శుక్తివిడిన నాటి మౌక్తికముగ

4. సింధువునుజేరి బిందువు సింధువగును
ధ్యేయమును బట్టి ప్రతిపని దివ్యమగును

5. మనిషి ఏకాకియైనను మనసులోన
గుంపులుగ భావములు చేరి గోష్ఠి జరుపు

6. కాలమే నాకు తగు నవకాశమిడిన
చేసి చూపుదు నెన్నెన్నొ చిత్రములను
మనసులోగల ఒక్కొక్క వ్రణము నేడు
బీజమగు దివ్యదీపికా వృక్షమునకు



7. వానచినుకులు మ్రింగగా వాగులోని
ప్రతి తరంగము మొసలియై వాయి విచ్చె
శుక్తిలోజేరి చినుకులు మౌక్తికమ్ము
లగుట కెన్నొ యాటంకము లావహించు


8. నాల్గు విశ్వాసములు వీడి నీల్గునట్టి
నరుని అతిశయమును చూచి నవ్వె పువ్వు

9. కాంక్షలన్నియు మృగతృష్ణికాతరంగ
ము లగుగావున యేల నిష్ఫలతకేడ్పు?

10. మృతినెరుంగని ఒంటి దేవతలకన్న
నలుగురికి మేలు చేసెడి నరుడె మిన్న

11. స్వర్గమును గూర్చి నాకు సర్వమ్ముతెలియు
మనసు సంతసపడుటకు మంచి ఊహ!

12. నిప్పు నీళ్ళలో చల్లార చప్పుడగును
ఎదియు గతియించునపుడు రోదించుగాదె!




తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

**భావాలు :**

1. జీవితంలో దేనినైనా తేలికగా సాధించటంకుదరదు. మనిషి మనిషిగా నిలబడటం ఎంతో కష్టం అంటే మానవీయ విలువలతో జీవించటం అంత సులభం కాదని భావం.
2. తన లోపాలను తాను తెలుసుకొనటమే గొప్ప విద్య. అలా తెలుసుకొన్నవాడే మనిషి.
3. ముత్యపుచిప్ప నుండి బయటపడిన ముత్యం లాగా స్వచ్ఛమైన మనస్సున్న వానికి గౌరవం లభిస్తుంది.
4. నీటి బిందువు సముద్రాన్ని చేరగానే సముద్రంలా మారుతుంది. అలాగే లక్ష్యాన్ని బట్టి ఏ పనికైనా గొప్పతనం చేకూరుతుంది.
5. మనిషి ఒంటరిగా కూర్చుంటే ఏవేవో ఆలోచనలు మనసులో నిండుతాయి. ('ఊరుకున్న వానికి ఊహలు ఎక్కువ' అని సామెత.)
6. నా మనసులోని ఒక్కొక్క బాధ రాబోయే కాంతి వృక్షానికి విత్తనం లాంటిది. నాకు తగిన అవకాశాలు వస్తే ఎన్నో అద్భుతాలు చేసి చూపగలను.
7. వాన చినుకులు రాలుతున్నప్పుడు వాగులోని ప్రతి అల మొసలిలాగా వాటిని మింగటానికి నోరు తెరుస్తుంది. కాని ముత్యపు చిప్ప నోటిలో పడ్డ వాన చినుకే ముత్యమౌతుంది. ఇలా చినుకు ముత్యంగా మారటానికి ఎన్ని ఆటంకాలను ఎదుర్కొంటుంది?
8. ధర్మ, అర్థ, కామ, మోక్షములనే నాలుగింటి యందు నమ్మకం లేకుండా బతికే వాని గర్వాన్ని చూసి పువ్వు నవ్వుతుంది.
9. కోరికలన్నీ ఎండమావులే, కనుక అవి తీరనప్పుడు బాధపడడమెందుకు?
10. మరణంలేని ఒంటరి దేవతకన్న మరణమున్నప్పటికీ ఇతరులకు మేలు చేసే మనిషే గొప్పవాడు. (ఇక్కడ ఒంటి దేవత అన్నప్పుడు సహాయపడని, లేదా వరమీయని దేవత అని భావం).
11. స్వర్గాన్ని గురించి నాకు అంతా తెలుసు. స్వర్గమనేది ఒక ఊహ. అది మనిషి మనసు సంతోషపడటానికి ఉపయోగపడేది.
12. నీళ్ళలో నిప్పు పడినప్పుడు "చుయ్" మని శబ్దంచేస్తూ చల్లారిపోతుంది. అలాగే ఏజీవి ఐనా చనిపోయేసమయంలో ఏడుస్తుంది.

**కవిపరిచయం:**



1. కవిపేరు : మీర్జా గాలిబ్
2. జననం-మరణం : 1797-1869
3. జన్మస్థలం : ఆగ్రా
4. రచనలు : ఉర్దూ, ఫారసీ భాషల్లో గజళ్ళు.

**అనువాదకవి పరిచయం:**



1. కవిపేరు : డా|| దాశరథి
2. జననం-మరణం : 1925-1987
3. జన్మస్థలం : చిన్నగూడూరు, వరంగల్లు జిల్లా
4. రచనలు : అగ్నిధార, రుద్రవీణ, మహోంధ్రోదయం, పునర్నవం, సినీశీతలం, వ్యాసాలు

# ఇవి చేయండి

## I. వినడం-మాట్లాడడం



1. గీతాల్లో చెప్పిన విషయాలేవి?
2. దివ్య దీపికా వృక్షం అంటే మీకు ఏం అర్థమైంది?
3. మీరు అనువాద పుస్తకాల గురించి చెప్పండి.
4. విషయాన్ని అనువాదం చేయడంవల్ల ఏం ప్రయోజనం ఉందని మీరనుకుంటున్నారు?

## II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. కింది భావాలుగల పంక్తులను పాఠం నుండి వెతికి రాయండి.

అ) ముత్యపు చిప్పలో చేరివాన చినుకులు ముత్యాలౌతున్నాయి.

ఆ) పది మందికి సహాయం చేసే మనిషే గొప్ప.


ఇ) మనలో ఉండే లోపాలను మనం తెలుసుకోవటమే అసలైన విద్య.

ఈ) ఎన్నెన్నో చిత్రాలను చేసి చూపిస్తాను.

2. కింది గేయ ఖండికను చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

కవులారా ! యువకవులారా !
నవకవులారా ! భావకవులారా !
భావితరానికి – బాటలు మీరే
భారత జాతికి నేతలు మీరే
శబ్దరూపము లెరుగక మీరు
స్వేచ్ఛగా తప్పులు వ్రాయొద్దు
తేనెలొలుకు మన తెనుగు భాషను
ఖూనీ హాని చేయొద్దు





**ప్రశ్నలు :**

అ) కవి ఎవరెవరిని సంబోధించారు ?

ఆ) తప్పులు ఎక్కడ జరుగుతున్నాయి ?

ఇ) తెలుగు ఎలాంటి భాష ?

ఈ) తెలుగు భాషను కొందరు ఏమి చేస్తున్నారు ?

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ) మనిషి పూర్ణుడయ్యేది ఎప్పుడు?

ఆ) సన్మానం ఏ రకంగా అబ్బుతుంది?

ఇ) పువ్వు ఎందుకు నవ్వింది?

ఈ) స్వర్గం గూర్చి కవి అభిప్రాయమేమి?

## III. స్వీయరచన



1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) ఏది సులభముగా సాధ్యపడదు? ఎందుకు?

ఆ) 'సహృదయం' అంటే మీరేమనుకుంటున్నారు?

ఇ) కోరికలన్ని ఎండమావుల్లో ఉండే తరంగాలని కవి అన్నాడు కదా? అలా ఎందుకు అని ఉంటాడు?

ఈ) స్వర్గం అంటే మీరేమనుకుంటున్నారు? ఎందుకు?

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.

అ) 'సింధువును జేరి బిందువు సింధువగును' దీన్ని ఉదాహరణలతో సమర్థిస్తూ రాయండి.

ఆ) ఎదియు గతియించునపుడు రోదించుగాదె! దీన్ని సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా? కారణాలు రాయండి.

## IV. పదజాలం



1. కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

అ) దుష్కరం ________________________________

ఆ) పూర్ణుడు ________________________________

ఇ) ధ్యేయం ________________________________

ఈ) గోష్ఠి ________________________________

ఉ) రోదన ________________________________

2. కింది గేయాన్ని చదవండి. గేయంలో గీతగీసిన పదాలకు సొంత వాక్యాలు రాయండి.

ప్రమద <u>వనమున</u> పారిజాతము
కవికులమున <u>కలికి</u> ముత్తెము
<u>ఏటిపాటల</u> తీపి ఊటల
భరత కోకిల సరోజనమ్మ



దండి యాత్రకు సాగె నామె
గాంధీ తాతయె మెచ్చె నామె
కులము మతము ఏవగించును
స్నేహమన్నను ప్రాణమిచ్చును.




అ) ______________________

ఆ) ______________________

ఇ) ______________________

ఈ) ______________________

ఉ) ______________________



### 3. కింది పదాల గురించి వివరిస్తూ రాయండి.

అ) సన్మానం ఆ) శుక్తి

ఇ) సింధువు ఈ) ఏకాకి

ఉ) గోష్ఠి ఊ) నాల్గు విశ్వాసాలు

### 4. వ్యతిరేకార్థక పదాలు రాయండి. రెండు పదాలు ఉండేలా వాక్యాలు రాయండి.

అ) సాధ్యము × __________ ఊ) __________ × ఫలం

ఆ) __________ × సుకరం ఋ) సంతసం × __________

ఇ) భావం × __________ ౠ) స్వర్గం × __________

ఈ) __________ × నిరాటంకం ఎ) మంచి × __________

ఉ) విశ్వాసం × __________

### 5. కింది పదాలను చదవండి. ప్రకృతి, వికృతి పదాలను జతపరచండి.

అ) సంతసం ( ) i) విద్య

ఆ) చిత్రము ( ) ii) హృదయం

ఇ) ఎద ( ) iii) చిత్తరువు

ఈ) విద్దె ( ) iv) సంతోషం



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## V. సృజనాత్మకత



**కింది వానిలో ఒక దానికి సమాధానం రాయండి.**

1. మీ మాతృభాషలోని ఏదైనా కవితను తెలుగు భాషలోకి అనువదించండి.
2. గాలిబ్ గీతాలను ఆధారంగా చేసుకుని కథను రాయండి.

## VI. ప్రశంస



**గాలిబ్ గీతాలలోని సౌందర్యాన్ని ప్రశంసిస్తూ మిత్రునకు లేఖ రాయండి.**



## VII. భాషాంశాలు



**1. కింది పద్య పాదాలను గమనించండి. వీటిలో ఉన్న అలంకారాన్ని గుర్తించండి.**

అ) గంతులు వేతురు కౌతుకమున.

(దీనిలో మళ్ళీ మళ్ళీ వచ్చిన హల్లు ..................................)

ఆ) పోరుదురు గికురు వొడచుచు దూఱుదురు.

(దీనిలో మళ్ళీ మళ్ళీ వచ్చిన హల్లు ..................................)

ఇ) ఒకనొకని చల్దికావడి,
నొకఁ దడకించి దాచు, నొకఁడొకఁ దది వే
ఱొకఁడొకఁని మొఱగి కొని చన
నొకఁ డొక ......................

ఈ పద్యంలో మళ్ళీ మళ్ళీ వచ్చిన హల్లు ..................................

**2. కింది విడదీసిన పదాలను కలిపి రాయండి.**

అ) దేశము + అంతా = ______ + ______

ఆ) ప్రాణము + ఇచ్చెను = ______ + ______

ఇ) వస్తున్నారు + అదిగో = ______ + ______

ఈ) విరాళము + ఇచ్చి = ______ + ______

ఉ) జమీను + అంటూ = ______ + ______

ఊ) ప్రకాశము + అతడే = ______ + ______



## ప్రాజెక్టు పని

రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి'కి మీ భాషలో చేసిన అనువాదాన్ని సేకరించండి. మీకు నచ్చిన ఒక ఖండికను గోడపత్రికపై ప్రదర్శించండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | గీతాలను భావ యుక్తంగా చదువగలను. భావాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | గేయఖండికలను చదివి అర్థం చేసుకోగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3. | గాలిబ్ గీతాల భావాలను సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | భావానికి అనుగుణంగా కథ రాయగలను. తెలుగులోకి అనువాదం చేయగలను. | ఔను / కాదు |

*"పడి లేచిన దానినే కెరటం అంటారు.*
*కష్ట సుఖాలనుభవించిన దానినే జీవితం అంటారు."*

యూనిట్-IV

# ఇద్దరు మిత్రులు

చదువు-ఆనందించు

ఇద్దరు మిత్రులు అడవి పక్కనుండి వెళ్తున్నారు. ఎలుగుబంటి ఒకటి వాళ్లకి ఎదురైంది. ఒకడు పిక్క సత్తువ చూపించి, చెట్టు ఎక్కి దాక్కున్నాడు. రెండవవాడు దారిలో ఒంటరిగా ఉండిపోయాడు. ఏమి చేసేందుకూ లేకపోయింది. వెంటనే కిందపడిపోయి చనిపోయినట్లుగా నటించాడు. ఎలుగుబంటి వాడి దగ్గరకు వచ్చింది. చుట్టూ వాసన చూసింది. వాడు ఊపిరి బిగపట్టుకొన్నాడు. ఎలుగుబంటి వాడి ముఖం వాసన చూసింది. చచ్చిన మనిషి అనుకుని తినకుండా అక్కడ నుండి వెళ్లిపోయింది.

ఎలుగుబంటి వెళ్లిపోయాక, ఆ రెండవవాడు చెట్టు దిగి, నవ్వుతూ అడిగాడు.

"ఏమిరా! ఎలుగుబంటి నీతో మాట్లాడినట్లుందే! నీ చెవిలో ఏదైనా రహస్యం చెప్పిందా ఏమిటి?" అని ఎగతాళిగా అడిగాడు మొదటివాణ్ణి.

అవును చెప్పింది. "ఆపదలో ఉన్న మిత్రుణ్ణి వదిలి వెళ్లిపోయినవాడు నిజమైన మిత్రుడు కాదు. అని చెప్పింది రా!" అన్నాడు రెండవవాడు.

# కోతి-మొసలికథ

పూర్వం ఒక కోతి తన మందనుండి విడిపోయి అడవిలో నివసిస్తోంది. అది అక్కడ అత్తిపళ్ళు తింటుంటే, ఒక పండు జారి నదిలో పడింది. ఒక మొసలి అది తిని దాని రుచికి చాలా సంతోషించింది. రాత్రి భార్యకీవిషయం చెప్పింది. అది ఎలాగైనా కోతి మాంసం తినాలనుకొంది.

మరునాడు, తనకు ఒక జబ్బు వచ్చిందనీ, అది కోతిగుండె తింటే తగ్గుతుందనీ చెప్పింది. భార్యకోసం మిత్రద్రోహం చెయ్యాలని మొసలి అనుకొంది. మొసలి తన ఇంటికి రమ్మని కోతిని ఆహ్వానించింది. కోతి నమ్మింది. మొసలి మీద కూర్చొని కొంత దూరం వెళ్ళాక మొసలిని అసలు కారణం అడిగింది కోతి. మొసలి నిజం చెప్పింది. కోతి ఎలాగూ ఆ నదిలో తప్పించుకోలేదని అనుకొని ఉన్నదున్నట్లు చెప్పింది మొసలి. అప్పుడు కోతి మోసం గ్రహించింది. ఎలాగైనా తప్పించుకోవాలనుకొంది. మొసలితో "అయ్యో! నా గుండె చెట్టుమీద పెట్టి వచ్చేశాను. వెనక్కి తీసుకెళ్ళు తెస్తాను" అంది కోతి.

మొసలి తన ప్రయాస వృథా అయినందుకు బాధపడి, వెనక్కి తీసుకొని వెళ్ళింది. కోతి ఒక్క గెంతులో చెట్టెక్కి "ఓరీ, మిత్రద్రోహీ! నా గుండె కావాలా? వెళ్ళు, వెళ్ళు" అంది.

**నీతి** : అపాయం వచ్చినా ఉపాయంతో తప్పించుకోవాలి.

# యూనిట్-IV

# 12. శీతాకాలం

**ఆలోచించండి - మాట్లాడండి**



"ఏటి కేతం పట్టి
ఎయి పుట్లు పండించి
ఎన్నడూ మెతుకెరగ నన్నా!
నేను గంజిలో మెతుకెరగనన్నా!"



ప్రశ్నలు:

1. ఏటికి ఏమి వేస్తారు?
2. పై చిత్రాలలో మీరు గమనించిన అంశాలేమి?
3. తాను ఏమి ఎరుగనంటున్నాడు?
4. ఈ గేయం ఎవరి గురించి చెప్తున్నది?
5. ఈ చిత్రాలు దేనికి సంబంధించినవి?

**ఉద్దేశం:** తొలకరి చినుకులకు పులకరించి పొలాన్ని దున్నటంతో ప్రారంభించి విత్తనం వేయడం, కలుపుతీయడం, నీళ్ళు కట్టడం, చీడ, పీడల నుండి పంటను రక్షించుకోవడం. తర్వాత పంటను కోసి ధాన్యాన్ని ఇంటికి తెచ్చే వరకు రైతు ఎన్నో కష్టనష్టాలను భరించవలసి వస్తున్నది. అటువంటి రైతు కష్టాలను హృద్యంగా తెలియజేయడమే ఈ పాఠ్యభాగ నేపథ్యం. ఈ పాఠం గంగుల సాయిరెడ్డి రాసిన కాపుబిడ్డలోనిది.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠం చిత్రంలో రైతు దేని గురించి ఆలోచిస్తున్నాడో ఊహించి చెప్పండి.
2. పాఠాన్ని చదివి అర్థంకాని పదాల, వాక్యాల కింద గీత గీయండి.
3. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
4. పాఠ్యభాగం చివరఉన్న 'పదాలు - అర్థాలు' పట్టిక చూసి తెలియని పదాల అర్థాలు తెలుసుకోండి.



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

కర్షకుల దృష్టిలో మూడే కాలాలుంటాయి. ఒకటి ఎండాకాలం. రెండవది వానా కాలం. మూడవది చలికాలం. ఈ మూడు కాలాల్లో ఆరు ఋతువులుంటాయి. వసంత, గ్రీష్మ, వర్ష, శరత్తూ, హేమంత, శిశిరాలు. బాగా ఆలోచిస్తే ప్రకృతి అణువణువులో ఈ ఆరు ఋతువుల ధర్మం నిక్షిప్తమై ఉంది. అయినా ఋతుప్రభావం పంటలపై, కర్షకుల పనులపై ఉంటుంది. కర్షక కుటుంబాలకు శీతవాతాతపాదుల వల్ల కలిగే కష్టనష్టాలకు కవి కదలిపోతాడు. ఆ కారణంగానే శీతాకాల వర్ణనలో ఆవేదన స్పష్టంగా కనిపిస్తుంది.

**సీ॥ చలికాలమందు పైరుల కావలికి రేయి**
**పొలములో నిద్రింపబోవు నొకఁడు.**
**ఉత్తరదిశ వాయు వురువడిగా వీవ**
**కునుకుచు చేనిలో గొణగు నొకఁడు**
**అద్దమ రేతిరి యెద్దుల చేబట్టి**
**మోట గొట్టుచు పాడు పాట నొకఁడు**
**బేరడ జోడుల వారులు దెగి కాఁడి**
**దాకిన బావిలో దూకు నొకఁడు.**

**తే॥ నీటిలో నుండి పైవచ్చి నిపగికాగి**
**తిరిగి పనిబట్టి సేయుచు తెల్లవాఱి**
**ప్రొద్దుబొడిచెడి వఱకును బురద దున్న**
**కర్షకా! నీదు పనిపాటు గాంతురెవరు? (1)**

**భావం:**


చలికాలమైనా రాత్రివేళలో పైరుల కావలికై పొలం దగ్గరికి వెళ్ళి ఒక రైతు పడుకొంటాడు. ఉత్తర దిక్కు నుండి గాలులు వేగంగా వీయగా కునికిపాట్లు పడుతూ ఒక రైతు చెవిలోనే గొణుక్కొంటున్నాడు. అర్ధరాత్రివేళ ఎద్దులను తీసుకొని వెళ్ళి మోట గొడుతూ ఒక రైతు పాట (మోటపాట) పాడుకొంటున్నాడు. మోటగొట్టే సమయంలో జోళ్ళ వారులు (ఎద్దుల మెడలకు కాడికి కట్టేతోలు లేదా తాటి దారాలు) తెగిపోగా కాడితాకి ఒక రైతు బావిలో పడిపోతాడు. అలా నీటిలో పడ్డ రైతు నీటిలో నుండి పైకి వచ్చి కొంత సేపు నిప్పు దగ్గర కాగి వెంటనే మోటపనిలోకి వెళ్ళిపోయాడు. తెల్లవారిన తర్వాత ప్రొద్దు పొడిచే వరకు బురద నేల దున్నుతాడు (ఇన్ని పనులు ఒకరు చేసేవే: అందరూ చేసేవే) ఓయి కర్షకా! ఇటువంటి వ్యవసాయ కర్మలో నీ కష్టాలను కొలిచేదెవరు?



సీ॥ చేకూలి దండగ చేతెడు ప్రొద్దెక్కె
నని పనికత్తెలు వనము నిండ
మోకాటి బంటిగా బురద లోపల వంగి
రెండు చేతుల వరి నిండి యుండ
నారుల గనిపెట్టి నాఱుకావడి బట్టి
పలుచన హలికులు బంచుచుండ
నొడిపిలి బాపుచు తడవును లేకుండ
నొక్కొక్క ముక్కను గుక్కు చుండి

తే॥ ప్రొద్దుగ్రుంకగా వడకుచు పొలము విడిచి
పడతులేగగ నరకాంఢ్రు పసుల గడగి
కంచెలందున మేపుచు సంచరింప
కాఁపుబిడ్డల గొడవల గాంతురెవరు? **(2)**

చేతెడు (చేయెంత ఎత్తు) ప్రొద్దెక్కింది : క్రైకిలి (క్రైకూలి – చేకూలి) దండగయి పోతుందని పనికత్తెలు చేలోనిండి పోయారు. మోకాటి బంటిగా ఉన్న బురదలో వంగి వరిని రెండు చేతులనిండా తీసుకొని, నారు నాటే వారిని చూచి, నారు కావడిని బట్టి కొద్ది కొద్దిగా వారికి పంచుతున్నారు. నారులో ఉన్న ఒడిపిలిని (కలుపుమొక్కను) గుర్తించి తీసివేసి, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఒక్కొక్క వరినారు మొక్కను బురదలో కుక్కుతున్నారు. ఈ లోగా పొద్దుకుంకింది. చలికి వణకిపోతూ పొలము విడిచి స్త్రీలందరూ ఇండ్లవైపు వెళ్ళారు. నాగళ్ళు కట్టిన వారు పశువులను కడిగి వాటిని కంచెల్లో మేపడానికి వెళ్ళి వాటి వెంబడే తిరుగుతున్నారు. నిజంగా కాపు బిడ్డల ఈ కష్టాలన్నీ కాంచేదెవరు?





తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

సీ॥ అడుసులో దున్ని లోదొడలన్ని జీలెను
కూర్చుండి కూటిని గుడవనియవు
అరికాళ్ళు మీఁగాళ్ళు నంతట నెఱియలై
బురదలో చరణముల్ బూననియవు
పగిలిని చేతుల పగ్గంబు బిగబట్టి
కుదురుగా నెద్దుల గుంజనియవు
పెదవుల బోదెత్త బెదరించి యదలించ
యదరి నొపగిల బెట్టి కదలనియవు.

గీ॥ కప్పుకొనజాలు బట్టల కలిమి లేదు
పాటు సేయక గూర్చుండు పనులు గలవు
బైట సిద్ధముగా నున్న పైరు గలదు
కర్షకా ! నీదు వెతలను గాంతు రెవరు. **(3)**

పొలంగట్టు బురదలో నాగలి గట్టి దున్నగా రైతులకు తొడలు పగిలి చీలిపోయాయి. ఆ పగుళ్ళు, కూర్చోని తిండి కూడా తిననీయవు. అరికాళ్ళు పాదాల పై భాగాలు, అంతటా పగుళ్ళే. ఆ కారణంగా బురదలో కాళ్ళు నిలపడానికే వీలుకాదు. పగిలిన చేతులతో పగ్గాలు బిగబట్టి ఎద్దులను గట్టిగా లాగనీయవు. పెదవులూ పగిలిన కారణంగా ఎద్దులను బెదరించి అయినా అదలించాలను కొంటే, పెదవులనే ఆ నొప్పులు కదలనీయవు, కప్పు కొనడానికి చాలినన్ని బట్టలు లేవు. సంపాదన లేదు. పాటు చేయకుండా కూచుందామనుకొంటే వీలుగాదు. పనులెన్నో ఉన్నాయి. అంతేగాక బయట సిద్ధంగా పైరున్నది. ఓయి కర్షకా! ఇటువంటి నీ కష్టాలను చూసే వారెవరు?

సీ॥ చలికాల మంత వేసారక నెప్పుడు
పైరు కావలియుండి పండవయ్య
ఈదర లోపల నిటునటు దిరుగుచు
మోట నాగలి జవదాటవయ్య
నరములు బిగబట్ట నడవ కాళ్ళాడక
నీటిలో బురదలో నిలుతువయ్య
పగలెల్ల పనిసేయ నిగమురే యేఁపగా
నలసట నిన్నెపు దంటదయ్య,

గీ॥ శీత కాలంబు వణకించి చెరుప దలచె
కాని యది మంటలో బడి గాలి సూర్యు
నందు నైక్యమైరి యాతె ముందు జూడ
కర్షకా ! నీదువెతలను గాంతురెవరు? **(4)**

ఓయి కర్షకా ! చలికాలమంతా విసిగి పోకుండా ఎప్పుడూ పైరు కావలియుండి అక్కడే పండుకో! చల్లటి ఈదరిలో అటునిటు తిరుగుతూ కూడా మోటనూ నాగలిని వదలకుండా నడుపు. నరములు లాగగా నడవడానికి కాళ్ళాడకున్నా నీటిలోనూ బురదలోనూ నిలుస్తావు. పగలంతా పనిచేసినా, రాత్రిపూట చలి బాధించినా అలసట నిన్ను తాకదు. ఈ విధముగా చలికాలం వణకించి నిన్ను చెడగొట్టాలను కొన్నది. కాని అదే మంటలో పడి గాలిలో, సూర్యునిలో ఐక్యమైంది. ఓ కర్షకా నీ బాధలను చూచేవారెవరు.

**కవిపరిచయం:**



| | | |
|---|---|---|
| కవి | : | గంగుల శాయిరెడ్డి |
| కాలము | : | 1890 – 1975 |
| జన్మస్థలం | : | రామచంద్రగూడెం, వరంగల్లు జిల్లా |
| రచనలు | : | కాపుబిడ్డ |
| శైలి | : | సరళం, సులభగ్రాహ్యం |

## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. ఈ పాఠానికి మరొక శీర్షిక పెట్టండి? ఆ శీర్షిక ఎందుకు పెట్టాలనుకున్నారు?
2. ఈ పద్యాలను రాగ భావయుక్తంగా చదవండి.
3. ఈ పద్యాల ద్వారా కవి ఏం తెలియజేస్తున్నారు?
4. ఈ పాఠం ఆధారంగా కూలీలు వరిని ఎలా నాటుతున్నారో తెలపండి.

### II. చదవడం, అవగాహన చేసుకోవడం



1. "పొలంగట్టు బురదలో ...................... కదలనీయవు."

   ఈ పద్య భావం చదివి ఐదు ప్రశ్నలు రాయండి?
2. పాఠ్యభాగం చదివి రైతు చేసే వేర్వేరు పనులను ఒక జాబితాగా రాయండి?
3. కింది పేరాను చదివి పాఠ్యాంశం ఆధారంగా ఖాళీలు పూరించండి!

   ఓయి కర్షకా ________ రోజంతా విసిగి పోకుండా, ఎప్పుడూ ________ కావలి యుండి ________ పండుకో. చల్లటి ఈదరలో అటూ ఇటూ తిరుగుతూ కూడా నాగలిని వదలకుండా నడుపు.
4. వ్యవసాయంలో రైతుతో పాటు ఇంకా ఎవరెవరు పాల్గొంటారు?
5. రైతుకు కాళ్ళు, పెదాలు పగిలినాయి కదా! అలా ఎందుకు జరిగింది?



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ) నాగళ్ళు దున్నిన రైతులు ఇంటికి ఎలా చేరుకుంటారో ఊహించి రాయండి.

ఆ) చలి రైతును ఇబ్బంది పెట్టదలచి చివరకు ఏమయ్యింది? అలా ఎందుకైంది?

ఇ) చలిలో రైతు పడే ఇబ్బంది గురించి రాయండి.

ఈ) నీటిలో పడిన రైతు బయటికి వచ్చి ఏమి చేస్తాడు? ఎందుకు? కారణాలు రాయండి.

**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) రైతు వ్యథలను వివరిస్తూ రాయండి.

ఆ) శీతాకాలంలో ఎలా ఉంటుంది? రైతు శీతాకాలంలో ఏమేమి చేస్తాడో రాయండి.

## IV. పదజాలం



**1. ఈ పాఠంలో వ్యవసాయానికి సంబంధించి ఏయే పదాలు కవి ఉపయోగించాడో వాటిని వెతికి జాబితా రాయండి?**

**2. కింది పదాలతో సొంత వాక్యాలు రాయండి.**

అ) కంచె　　ఆ) అదుసు　　ఇ) చరణములు

ఈ) కలిమి　　ఉ) పొలము

**3. కింది పట్టిక ఆధారంగా వీలయినన్ని పదాలు రాయండి**

ఉదా: అదుసు

| | | | |
|---|---|---|---|
| అ | లి | వె | లం |
| హా | దు | కా | త |
| ఈ | త | ద | కు |
| శీ | లు | సు | ర |

అ) ____________

ఆ) ____________

ఇ) ____________

ఈ) ____________

ఉ) ____________

## V. సృజనాత్మకత



**కింది వాటిలో ఒకదానికి సమాధానం రాయండి.**

అ) రైతు కష్టాలను వివరిస్తూ ఒక గేయం రాయండి.

ఆ) రైతులాగే రైతు కూలీల కష్టాలు వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

ఇ) పాఠ్యాంశం ఆధారంగా రైతు ఆత్మకథ రాయండి.

## VI. ప్రశంస



**కింది వానిలో ఏదైనా ఒకదానికి సమాధానం రాయండి.**

అ) రైతు సమస్యలపై గేయం ఆత్మకథ రాసిన ఒక కవిని ప్రశంసించండి.

ఆ) మీ తరగతిలో ఎవరు పద్యాన్ని రాగ, భావ యుక్తంగా పాడుతారో వారిని ప్రశంసిస్తూ నాలుగైదు వాక్యాలు రాయండి.

ఇ) రైతు ఉపయోగించే వ్యవసాయ పనిముట్లు, వాటి ఉపయోగాలను ఒక పట్టిక రూపంలో చార్టుపై రాసి ప్రదర్శించండి.

| పనిముట్టు | ఉపయోగం |
|---|---|
| 1. నాగలి | పొలం దున్నడానికి |

## VII. భాషాంశాలు




**1. "ఆమె ముఖం అందంగా ఉంది."**

**'ఆమె ముఖం చంద్రబింబంలా(గ) అందంగా ఉన్నది.'**

అ) పై వాక్యాల్లోని తేడాను గమనించారా! 'ఆమె ముఖం అందంగా ఉంది.' అనేదానికి బదులుగా

**'ఆమె ముఖం చంద్రబింబం లాగ అందంగా ఉన్నది'** అనే వాక్యం మనలను బాగా ఆకట్టుకుంటుంది. ఇలా ఆకట్టుకునేలా చెప్పడానికి 'చంద్రబింబం' అనే పోలికను తీసుకున్నాం. ఈ విధంగా ఒక విషయాన్ని ఆకట్టుకునేలా చెప్పడానికి పోలికను పేర్కొనడాన్ని 'ఉపమాలంకారం' అంటారు.



ఈ అలంకారంలో 'ఉపమేయం, ఉపమానం, ఉపమావాచకం, సమానధర్మం' అనేవి ఉంటాయి. పై ఉదాహరణలో

ఉపమేయం (వర్ణించబడినది) – ఆమె

ఉపమానం (పోలికకోసం తీసుకోబడినది) – చంద్రబింబం

సమానధర్మం (రెండింటిలో సమానమైనది) – అందం

ఉపమావాచకం (ఉపమానం, ఉపమేయాలను సమాన ధర్మంతో కలిపి చెప్పడానికి ఉపయోగించే పదం – లాగ

**2. కిందివాటిని రాయండి.**

| సమాస పదం | విగ్రహవాక్యం | సమాసంపేరు |
|---|---|---|
| అ) ________ | రెండు సంఖ్యగల చేతులు | ________ |
| ఆ) బిడ్డల గొడవ | ________ | ________ |
| ఇ) కర్షక హస్తము | ________ | ________ |
| ఈ) ________ | నీయొక్క వెతలు | ________ |
| ఉ) మూడు రోజులు | ________ | ________ |



## ప్రాజెక్టు పని

మీ నగరం / గ్రామంలో ఉండే సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను మీరు ఎలా ఊహిస్తున్నారో తెలిపే పట్టికను తయారుచేసి మీ తరగతిలో ప్రదర్శించండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | పద్యాలను, భావయుక్తంగా పాడగలను. ఈ పాఠం భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పద్యభావాలను అర్థంచేసుకొని ప్రశ్నలు రాయగలను. | ఔను / కాదు |
| 3. | ఈ పద్యాలలోని పదాల అర్థాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయగలను. | ఔను / కాదు |
| 4. | రైతు వ్యథల గురించి, శీతాకాలం గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 5. | రైతు ఆత్మకథ రాయగలను. | ఔను / కాదు |

"దున్నని నేల, సంస్కారం లేని మనసు
మంచి ఫలితాలనివ్వవు"

# పదాలు-అర్థాలు

**అ**

| | | |
|---|---|---|
| అంఘ్రి | = | పాదం |
| అంది | = | అందుకొని,తీసుకొని |
| అందెలు | = | స్త్రీలు కాలి మడమలకు పైనపెట్టుకొనే నగలు |
| అక్కఱపాటు | = | అవసరం |
| అచ్చపు | = | నిజమయిన, అసలయిన |
| అచ్చు | = | ముద్రణ |
| అట | = | అక్కడ |
| అడుసు | = | బురద |
| అద్దమరేయి | = | అర్ధరాత్రి |
| అధ్యక్షత | = | పెద్ద అధికారం వహించడం |
| అనర్థం | = | నష్టం |
| అనవుడు | = | అనగా |
| అనాలోచితం | = | ఆలోచించకుండా చేసేది |
| అని | = | చెప్పి |
| అన్వయం | = | పొందిక |
| అపకీర్తి | = | చెడ్డపేరు |
| అబద్ధం | = | అసత్యం |
| అమరు | = | ఒప్పు, తగి ఉండటం |
| అర్పించు | = | ఇచ్చు |
| అవధి | = | హద్దు |
| అస్తది | = | వస్తుంది |

**ఆ**

| | | |
|---|---|---|
| ఆచార్యుడు | = | గురువు |
| ఆధారం | = | ఊతం |
| ఆయాసం | = | శ్రమ |
| ఆరాధన | = | పూజ |
| ఆలిసం | = | ఆలస్యం |
| ఆవిష్కరణ | = | ప్రకటన,బయలు పరచడం, కనబరచుట |
| ఆహ్వానం | = | పిలుపు |

**ఇ**

| | | |
|---|---|---|
| ఇన కులాధిపుడు | = | సూర్యవంశంలో గొప్పవాడు |
| ఇనాం | = | బహుమతిగా ఇచ్చిన పొలం |
| ఇనుడు | = | సూర్యుడు |

**ఉ**

| | | |
|---|---|---|
| ఉపకరణం | = | పనిముట్టు |
| ఉద్దేశ్యం | = | అభిప్రాయం |
| ఉద్వేగం | = | వ్యాకులత, ఆవేశం |
| ఉద్బోధ | = | తెలియజేయడం |
| ఉన్నతగతి | = | గొప్పస్థితి |
| ఉరువడు(క్రి) | = | నెరవేరు |

**ఎ**

| | | |
|---|---|---|
| ఎగరి | = | వికాసం పొంది |



తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

| | | |
|---|---|---|
| ఎడద | = | హృదయం |
| ఎలమి | = | వికాసం |
| ఎల్లరు | = | అందరు |
| ఎసగొను | = | పురికొను |

**ఏ**

| | | |
|---|---|---|
| ఏవగించు | = | అసహ్యించుకొను |
| ఏగు | = | వెళ్ళు, పోవు |

**ఒ**

| | | |
|---|---|---|
| ఒగి | = | క్రమంగా |
| ఒసగ | = | ఇవ్వగా |

**క**

| | | |
|---|---|---|
| కట్ట | = | గట్టు, ఆనకట్ట |
| కడియాలు | = | చేతులకుగాని, కాళ్ళకుగాని ధరించే వలయాకారపు నగలు |
| కపి | = | కోతి |
| కపికులాధీశుడు | = | కోతులలో శ్రేష్ఠుడు |
| కమలాప్తవంశ | = | తామరపూలకు ఆప్తుడైన సూర్యవంశం వాడా! |
| కమలయుగ్మం | = | తామరపూల జంట |
| కరం | = | చేయి |
| కరకు | = | కఠినమైన |
| కరపడం | = | బోధించడం |
| కర్షకుడు | = | రైతు |
| కరాగ్రం | = | చేతి చివరిభాగం |
| కలహం | = | కొట్లాట |
| కలికి | = | మనోజ్ఞమైన స్త్రీ, నేర్పరి |
| కలిమి | = | సంపద |
| కాగులు | = | పెద్ద మట్టికుండలు |
| కారు | = | దట్టమైన |
| కావించు(క్రి) | = | చేయు |
| కీర్తి | = | ఖ్యాతి, మంచిపేరు |
| కునుకు | = | నిద్ర, తూగు |

**గ**

| | | |
|---|---|---|
| గాబరా | = | తొందరపాటు, కంగారు,దిగులు |
| గేహం | = | ఇల్లు |
| గ్రామం | = | పల్లె |
| ఘనత | = | గొప్పదనం |

**చ**

| | | |
|---|---|---|
| చను | = | వెళ్ళు |
| చనుదెంచి | = | వచ్చి |
| చర్చించు | = | వివిధ కోణాల్లో ఆలోచించి మాట్లాడు |
| ఛాందసుడు | = | ఛందస్సు (వేదం) అధ్యయనం చేసినవాడు |
| చింతించు | = | బాధపడటం, ఆలోచించటం |
| చిహ్నం | = | గుర్తు |
| చూడ్కులు | = | ,చూపులు |

**జ**

| | | |
|---|---|---|
| జంగల్ | = | అడవి |
| జమీన్ | = | భూమి |
| జలం | = | నీరు |
| జుంటీగలు | = | తేనెటీగలు |

| | | |
|---|---|---|
| | త | |
| తడయక | = | ఆలస్యం చేయక |
| తడవు | = | ఆలస్యం |
| తత్త్వం | = | స్వభావం |
| తరి | = | సమయం |
| తరువు | = | చెట్టు |
| తరుమూషకం | = | ఉడుత |
| తలకొను(క్రి) | = | పూనుకొను |
| తలపక | = | ఎంచక |
| తామర | = | కమలం, పద్మం |
| తిరుగ | = | మళ్ళీ, తిరిగి |
| త్రిరేఖ | = | మూడు గీతలు |
| తెరగు | = | విధం |
| | ద | |
| దక్షిణభాగం | = | కుడివైపు |
| దర్శనం | = | చూడటం |
| దాత | = | దానమిచ్చేవాడు |
| దివ్యమైన | = | గొప్పదియైన |
| దివ్వె | = | దీపం |
| ద్వేషం | = | పగ, అసహ్యం, ఏవగింపు |
| | ధ | |
| ధరణి | = | భూమి |
| ధ్యానం | = | మనసు లగ్నత |
| | న | |
| నిఘంటువు | = | పదాల అర్థాలను తెలిపే పుస్తకం |
| నమ్మబలికి | = | నమ్మకంగా చెప్పి |
| నిదర్శనం | = | ఋజువు |
| నరకాంద్రుడు | = | పొలందున్నేవారు, రైతులు |
| నిరంతరం | = | ఎల్లప్పుడు |
| నిరాశపడు | = | అనుకున్నపని జరగకపోవడం వల్లబాధపడు |
| నిరాహారం | = | ఆహారం లేకుండా |
| నిర్దేశకులు | = | చూపేవారు, నడిపించేవారు |
| నీర్సం | = | నీరసం |
| నిరోధించు | = | అడ్డుకొను |
| | ప | |
| పంచకావ్యాలు | = | ఐదుకావ్యాలు |
| పగ్గం | = | ఎద్దులను అదుపుచేయడానికి వాడే పొడవైన తాడు |
| పడతి | = | స్త్రీ |
| పత్రికాప్రతినిధి | = | విలేఖరి |
| పదము | = | పాదం, అడుగు |
| పరమపదం | = | వైకుంఠం, ముక్తి మార్గం |
| పలుతెరలు | = | పలు విధాల |
| పాటవం | = | నైపుణ్యం, పటుత్వం, బలం |
| పాపి | = | పాపం చేసినవాడు |
| పుంఖానుపుంఖంగా | = | వరసగా ఒకదానివెనుక ఒకటిగా |
| పూని | = | పూనుకొని |
| పొలిమేర | = | ఊరిచివర,హద్దు |
| ప్రతిధ్వని | = | మారుమోత |
| ప్రతిభ | = | అప్పటికప్పుడు కలిగే తెలివి |
| ప్రమద వనం | = | అంత:పురస్త్రీలు విహరించే ఉద్యానవనం |
| ప్రయాస | = | కష్టం |
| ప్రవహించు | = | పారు |


తెలంగాణ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

| | | |
|---|---|---|
| ప్రాధేయపడు | = | వేడుకొను |
| ప్రామాణికం | = | ప్రమాణం |
| ప్రేరేపించు | = | పురికొల్పు |

**బ**

| | | |
|---|---|---|
| బలియులు | = | శక్తిమంతులు |
| బీట | = | పగులు |
| బుద్ధి | = | మనసు,చిత్తం,మతి,తెలివి |
| బృందం | = | సమూహం |
| బొకెపెంకులు | = | పగిలిన చిన్న కుండ ముక్కలు |

**మ**

| | | |
|---|---|---|
| మంత్రి | = | రాజుకు ప్రధాన సలహాదారుడు |
| మక్కికి మక్కి | = | ఉన్నది ఉన్నట్లు |
| మట్టుపెట్టు | = | చంపు |
| మదం | = | అహంకారం |
| మది | = | మనస్సు |
| మనము | = | మనస్సు |
| మర్మం | = | రహస్యం, గుట్టు |
| మసక | = | కనుచీకటి,స్పష్టంగా కంటికి కనపడకపోవడం |
| మాధుర్యం | = | తీయదనం |
| మానెడు | = | సుమారు ఒక కేజి తూకం,మానికఅనే కొలత పాత్రలోపట్టినన్ని(గింజలు) |
| మారణహోమం | = | హత్యాకాండ |
| మోట | = | బావిలోంచి ఎడ్లతో నీళ్ళుతోడే సాధనం |
| మెరక | = | మెట్ట భూమి |
| మేను | = | శరీరం |

**య**

| | | |
|---|---|---|
| యాచకుడు | = | భిక్షగాడు, అడుక్కునేవాడు |
| యుక్తం | = | తగినది |

**ర**

| | | |
|---|---|---|
| రాల్చి | = | విదలించి |
| రూఢి | = | నిర్ధారణ |
| రోషం | = | కోపం, ఆవేశం |

**వ**

| | | |
|---|---|---|
| వక్త | = | (చక్కగా) మాట్లాడేవాడు |
| వడి | = | వేగం |
| వనం | = | అడవి |
| వనధి | = | సముద్రం |
| వ్యాధి | = | జబ్బు |
| విదుల్చు | = | రాల్చు |
| విధేయుడు | = | చెప్పిన పనిని తప్పక చేసేవాడు |
| వినుతి | = | ప్రసిద్ధి, మెప్పు |
| వెత | = | బాధ, వ్యథ |
| వెన్క | = | వెనుకవైపు |
| వేడ్క | = | సంతోషం |
| వేల్పు | = | దేవత |

**స**

| | | |
|---|---|---|
| సంతం | = | సొంతం |
| సకలం | = | మొత్తం |
| సజావుగా | = | సక్రమంగా |
| సురయితున్నప్పుడు | = | మొదలయితున్నప్పుడు |
| సూటిగా | = | నేరుగా |
| సృజనాత్మక | = | కొత్త సృష్టి, కొత్త ఆలోచన |
| స్రవంతి | = | ప్రవాహం, నది |
| స్వస్తి | = | శుభం |
| స్థావరం | = | నిలకడగా ఉండే స్థానం, శత్రువుకు దక్కకుండా పకడ్బందీగా ఏర్పాటు చేసుకొన్న స్థలం |